www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
మంగళవారం | 18 | ఆగస్టు | 2026 పేజీలు : 8

## ఈ ఏడాదైనా పెసలు కొనుగోలు చేస్తారా..?



-పెరిగిన అపరాల సాగు
-మార్క్‌ఫెడ్ కొనుగోలుపై ప్రకటన చేయని ప్రభుత్వం

2లో

# ఏం మారింది.. అంతా అదే తంతు..!



**-అవే ఆక్రమణలు.. అవే పైరవీలు**
**-తల ఆడించడమే పనిగా అధికారులు**



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మం నగరానికి సంబంధించి గత ప్రభుత్వ హయాంలో బిఆర్‌ఎస్ ద్వితీయశ్రేణి నాయకత్వంపైన అప్పటి పోలీస్, రెవెన్యూ యంత్రాంగంపైన తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. బిఆర్‌ఎస్ నేతల భూ ఆక్రమణలకు అధికారులకు తోడ్పాటునందిస్తున్నారన్నది అప్పట్లో ప్రధాన ఆరోపణగా ఉంది. మూడేళ్ల తర్వాత తిరిగి అవే విమర్శలు ఇప్పటికీ అధికార పార్టీ ద్వితీయ శ్రేణి నాయకత్వంపైన వినపడుతున్నాయి. ఇందులో గమనించాల్సింది ఏమిటంటే అప్పటి బిఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఏ వ్యక్తులైతే ప్రభుత్వ స్థలాలను అక్రమించి అధికారాన్ని ఉపయోగించుకున్నారో అదే వ్యక్తులు ఇప్పుడు పార్టీ మారి యథెచ్చగా ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ఇది సరికాదన్న అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. ప్రస్తుత ప్రజాప్రతినిధులకు తప్పుడు సమాచారం అందించి అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. ముఖ్యంగా అప్పుడు, ఇప్పుడు అధికార పార్టీలో కొనసాగుతున్న వారే ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారు.

మిగతా 2లో..

## జిల్లాలో 1085927 మంది ఓటర్లు




**-ముసాయిదా ఓటరు జాబితా విడుదల**
**-క్లెయిమ్‌లు, అభ్యంతరాలకు సెప్టెంబర్ 16 వరకు అవకాశం**
**-ఎస్ఐఆర్ ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేశామని జిల్లాలో 1085927 మంది ఓటర్లు ఉన్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాలు ఏమైనా ఉంటే సెప్టెంబర్ 16లోగా సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. సోమవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ పి. శ్రీజతో కలిసి ఎస్ఐఆర్ ప్రక్రియ ముసాయిదా ఓటరు జాబితాపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 17 (సోమవారం) ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేసి రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించినట్లు కలెక్టర్ తెలిపారు. మొత్తం ఖమ్మం జిల్లాలో 1085927 మంది ఓటర్లతో ముసాయిదా ఓటరు జాబితా విడుదలైందన్నారు. ఇందులో 524894 మంది పురుషులు, 560973 మంది మహిళా ఓటర్లు, 60 మంది థర్డ్‌జెండర్ ఓటర్లు ఉన్నారన్నారు. 133004 మంది అంటే 12.24 శాతం ఓటర్లను అనామలిస్‌గా గుర్తించినట్లు, 43131 మంది (3.97 శాతం) ఓటర్లకు

మిగతా 2లో..

## పంటలు ఎండిపోకుండా కాపాడాలి

-రైతులకు సకాలంలో సాగునీటిని అందించాలి
-కాలువలు, కెనాల్‌లను నిరంతరం పరిశీలించాలి
-కలెక్టర్, నీటిపారుదల శాఖాధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం

2లో..



(ఫైల్)

## అలియాస్ పేర్ల పరిష్కారానికి కమిటీ



- నెల రోజుల్లో సమస్యకు శాశ్వతపరిష్కారం
- కార్మికుల వారసుల దీక్షలు విరమణ
- పరిష్కారం కాకుంటే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తాం
- డిస్మిస్ కార్మికులను మానవతా దృక్పథంతో చూడాలి
- ఎంఎల్‌ఏ కూనంనేని

2లో

# ఏం మారింది.. అంతా అదే తంతు..!



(మొదటిపేజీ తరువాయి)

ఖమ్మం నగరంలో 12 నుంచి 14వ డివిజన్ వరకు గల నాగార్జున సాగర్ కాలువలను అక్రమించి జీవో నెం.58, 59 క్రింద రిజిస్ట్రేషన్ చేయించుకుని ఆక్రమణలకు పాల్పడిన వారు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మళ్లీ భూ ఆక్రమణలకు పాల్పడి విలువైన ప్రభుత్వ స్థలాలను సొంతం చేసుకుంటున్నారు. పలువురి ఫిర్యాదు మేరకు రెవెన్యూ, నీటి పారుదల శాఖాధికారులు చర్యలు చేపట్టేందుకు సిద్ధం కాగానే ప్రస్తుత మంత్రి ద్వారా రెవెన్యూ అధికారులకు ఫోన్లు చేయించి చర్యలను నిలుపుదల చేయించారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. అధికార పార్టీ నేతలు ఆ స్థలాల వైపు కన్నెత్తి చూడవద్దని హుకుం జారీ చేయడంతో రెవెన్యూ అధికారులు ఫైళ్లు పక్కనపడేశారు. గత ప్రభుత్వంలో ఇలా చేశారనే కదా ప్రజలు ఓటు ద్వారా తమ తీర్పునిచ్చింది. ఇప్పుడు కూడా అదే జరిగితే ఏమి మారినట్లు అన్న ప్రశ్న వినవస్తుంది. పోలీస్ విషయంలోను ఇదే జరుగుతుంది. గత ప్రభుత్వంలో కొందరు పోలీస్ అధికారులు అధికార పార్టీ నాయకుల్లా వ్యవహరించారు. మరికొంద రైతే ఓ అడుగు ముందుకేసి అప్పటి అధికార పార్టీ నేతల వాహనాలు నడిపి భక్తి చాటుకున్నారు. ఇప్పుడు కూడా పలు వివాదాలలో అధికార పార్టీ నేతల పైరవీలు జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్నాయన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఇది సహజమే అయినా శృతిమించినప్పుడే సామాన్యులు ఇబ్బందులు పడక తప్పడం లేదు. మట్టి, ఇసుక ఇప్పుడు అతి పెద్ద ఆదాయ వనరుగా మారింది. ఇసుక, మట్టి వ్యాపారానికి సంబంధించి గతంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఏ వ్యక్తులు అక్రమాలకు పాల్పడ్డారో అదే వ్యక్తులు ఇప్పుడు అదే పనిలో ఉన్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. అధికార పార్టీపైనా, నాయకులపై వ్యక్తిగత ఆరోపణలు రావడం సహజమే కానీ వాటిలో నిజనిజాలపై అమాత్యులు ఆలోచించక తప్పదు. ఇక అధికార యంత్రాంగం అధికార పార్టీ నాయకుల పేరు చెప్పి అడ్డంగా నొక్కేస్తున్నారు. ఏమైనా ఆరోపణలు రాగానే అధికార పార్టీ నేతలను ఆశ్రయించడం తిరిగి అదే స్థానంలో కొనసాగడం ఇప్పుడు అలవాటుగా మారింది. ఇక గుత్తేదారుల విషయానికి వస్తే అధికారులు గుత్తేదారులు చేపట్టిన పనులు, నాణ్యత పై ప్రశ్నించలేకపోతున్నారు. జిల్లాలో ప్రధానమైన పనులు, నిర్మాణాలు చేపట్టిన గుత్తేదారులు అందరూ అధికార పార్టీ నాయకులకు కుడి భుజంగానో, ఎడమ భుజంగానో ఉన్న వారు కావడంతో చర్యలకు జంకుతున్నారు., ప్రభుత్వం మారినప్పుడల్లా గుత్తేదారులు, పైరవీకారులు పార్టీ మారడం, తమ స్వార్థం, అక్రమ సంపాదనల కోసం మొత్తం వ్యవస్థను తప్పుదారి పట్టించడం జరుగుతుంది. అతి కొద్ది మంది వ్యవహారశైలితో నిజాయితీపరులైన ప్రజాప్రతినిధులకు సైతం మచ్చ తెచ్చిపెడుతుంది. గతంలో ఇటువంటి వ్యక్తుల వలనే అబాసుపాలైన వారిని చూసినా తర్వాత అయినా ప్రస్తుత ప్రజాప్రతినిధులు తగు జాగ్రత్తలతో వ్యవహరించకపోతే గతమే పునరావృతమవుతుంది. మంత్రులు మా జేబులో ఉన్నారు ఇలా చెబితే అలా పని అయిపోతుందని డబ్బులు వసూలు చేసే అక్రమార్కుల పట్ల మరింత అప్రమత్తత అవసరం.

# ఈ ఏడాదైనా పెసలు కొనుగోలు చేస్తారా..?

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పెసర, మినుము, ఇతర అపరాల పంటల సాగు గణనీయంగా పెరిగింది. అధికార యంత్రాంగం సైతం వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో అపరాల పంటలను సాగు చేయాలని రైతులను చైతన్యపరిచిన నేపథ్యంలో ఈ ఏడాది ఖమ్మం జిల్లాలో 35వేల ఎకరాల్లో పెసర సాగు చేశారు. మినుము పంటలు సైతం 10వేల ఎకరాల్లో సాగు చేశారు. గతేడాది ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా పెసర కొనుగోలు చేయకపోవడంతో రైతులు భారీగా నష్టపోయారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాకు రూ.8,460 ఉండగా ప్రైవేటు వ్యాపారులు రైతుల వద్ద నుంచి క్వింటా నాలుగైదు వేలకు మించి కొనుగోలు చేయలేదు. రైతులు పెసర విక్రయాలకు సంబంధించి నానా ఇబ్బందులు పడ్డారు. కొందరు వ్యాపారులు రైతులకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించక ముఖం చాటేసిన సందర్భాలు చోటు చేసుకున్నాయి. ధర తక్కువకు విక్రయించాల్సి రావడమే కాకుండా పెసలు కొనుగోలు బాపతు నగదు వ్యాపారులు ఇవ్వకపోవడంతో రైతులు తీవ్ర వేదనకు గురయ్యారు. అయితే ఈ ఏడాది పంటల నమోదు ప్రక్రియ పూర్తి స్థాయిలో కాలేదు. ప్రస్తుత ప్రాథమిక సమాచారం ప్రకారం 35వేల ఎకరాల్లో సాగు చేసినందున దిగుబడి రైతుల అవసరాలు తదితర విషయాలను దృష్టిలో ఉంచుకుని మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి పెసలు కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

# జిల్లాలో 1085927 మంది ఓటర్లు

(మొదటిపేజీ తరువాయి)

మ్యాపింగ్ కానట్లు గుర్తించినట్లు తెలిపారు. 176135 మంది ఓటర్లకు ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారుల ద్వారా నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు తమ పుట్టిన తేదీ ఆధారంగా ఎన్నికల సంఘం సూచించిన పత్రాలను సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. ముసాయిదా ఓటరు జాబితాలో పేరు లేనట్లయితే బూత్ స్థాయి, సహాయ ఎన్నికల నమోదు అధికారి, ఎన్నికల అధికారిణి సంప్రదించాలన్నారు. ఏమైనా అభ్యంతరాలు, క్లైయిమ్‌లు ఉంటే సెప్టెంబర్ 16 లోపు సమర్పించాలన్నారు. ఫారం 6 ద్వారా సెప్టెంబర్ 16 లోపు కొత్త ఓటర్లు నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. వచ్చిన అభ్యంతరాలు, క్లైయిమ్‌లను పరిష్కరించి అక్టోబర్ 19న తుది ఓటరు జాబితాను విడుదల చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఎస్‌డిసి సదానందం, ఆర్డీవో శ్రీనివాస్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాజు, డిటి అన్సారీ, వివిధ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అలియాస్ పేర్ల పరిష్కారానికి కమిటీ

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సింగరేణి సంస్థలో మారుపేర్లతో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను నెల రోజుల్లో పరిష్కరించేందుకు యాజమాన్యం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసిందని ఈ నిర్ణయంతో కార్మికుల వారసులకు న్యాయం జరుగుతుందని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట అలియాస్ పేర్ల బాధితులు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షలను సోమవారం కూనంనేనితో పాటు సింగరేణి పర్సనల్ మేనేజర్ కిరణ్‌కుమార్ బాధితులను నిమ్మరసం ఇచ్చి దీక్షలను విమరమింపజేశారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ పూర్వం కార్మికులు దొరకని రోజుల్లో ఉద్యోగాల్లో చేరినప్పుడు తప్పులు దొర్లాయని, దీనివల్ల నేడు వారి పిల్లలకు ఉద్యోగాలు రాక తీవ్ర మానసిక ఆందోళన చెందుతున్నారన్నారు. తప్పుడు పేర్లు ఉన్నాయని సింగరేణి విజిలెన్స్ విభాగం విచారణ పేరుతో వేదింపులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కారణంగా వారసులకు ఉద్యోగాలు రావడం లేదన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం కోల్ బల్ట్ ఎంఎల్‌ఏల సమావేశంలో యాజమాన్యంతో చర్చించామని తెలిపారు. ఫలితంగా ముగ్గురు యాజమాన్య ప్రతినిధులు, ఇద్దరు ఏఐటియూసి ఒక్కరూ ఐఎన్‌టియూసి ప్రతినిధులతో కూడిన ఆరుగురు సభ్యుల కమిటీని యాజమాన్యం ఏర్పాటు చేసిందన్నారు. ఈ కమిటీ నెలరోజుల్లో సమస్యను అధ్యాయనం చేసి పరిష్కార మార్గాన్ని చూపుతుందన్నారు. యాజమాన్యం ఇచ్చిన హామీ మేరకు నెలరోజుల్లో సమస్యను పరిష్కరించకుంటే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. గతంలో వివిధ కారణాలతో డిస్మస్ అయిన కార్మికుల సమస్యను కూడా యాజమాన్యం మానవతా కోణంలో పరిశీలించి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్ యూనియన్ నాయకులు వంగ వెంకట్ జి వీరస్వామి శేషయ్య రమణమూర్తి గట్టయ్య కిష్టాఫర్ సందెబోయిన శ్రీనివాస్ మాతంగి లింగయ్య బండారి మల్లయ్య నర్సయ్య కార్మికుల వారసులు లక్క శ్రావణ్, ధనాల రాజేందర్ జే రాజేందర్ డిష్ బాబు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# పంటలు ఎండిపోకుండా కాపాడాలి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మంజిల్లాలో సాగర్ ఆయకట్టు క్రింద రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోకుండా సకాలంలో సాగునీటిని అందించేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సాగర్ ఆయకట్టు పరిధిలోని రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నీటి లభ్యతను అంచనా వేస్తూ అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించేలా సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్, నీటిపారుదల శాఖాధికారులకు సూచించారు. సాగుచేసిన పంటలకు నీటిని సకాలంలో అందించాల్సిన అవసరం ఉందన్న విషయాన్ని ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు మంత్రి తెలిపారు. సీతారామ ప్రాజెక్టు పంపు హౌజ్ నుంచి గోదావరి జలాలను సాగర్ ఆయకట్టు ప్రాంతాలకు అందించేందుకు తక్షణమే ఆదేశాలు జారీ చేసినందుకు మంత్రి తుమ్మల ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రధాన కాలువలను, కెనాల్ లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నీరు వృథాగా పోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రాజెక్టులలోకి వస్తున్న జలాలను అత్యంత జాగ్రత్తగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. రైతులకు అవసరమైన మేర నీరు అందేలా అధికారులు ప్రణాళికాబద్ధంగా చేపట్టాలన్నారు. రైతులు వేసిన పంటలను కాపాడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తుమ్మల తెలిపారు. పంటలను కాపాడేందుకు తక్షణమే స్పందించి సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను విడుదల చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఖమ్మంజిల్లా ప్రజలు రైతుల తరుపున మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు.

# వాటర్ ట్యాంక్‌ని శుభ్రం చేసిన కౌన్సిలర్ శైలజ



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు దిద్దుపూడిలో వాటర్ ట్యాంక్‌ను ఒక మహిళ అయినప్పటికీ అంత ఎత్తులో ఉన్న ట్యాంకు ధైర్యంగా ఎక్కి కౌన్సిలర్ నల్లమోతు శైలజ సురేష్ శుభ్రం చేయించారు. మున్సిపల్ సిబ్బందితో కలిసి ఆమె స్వయంగా వాటర్ ట్యాంక్‌లోకి దిగి శుభ్రత పనుల్లో పాల్గొన్నారు. మహిళలు అయినప్పటికీ ధైర్యంగా ట్యాంక్‌లోకి దిగి పారిశుధ్య పనులను పర్యవేక్షించడం స్థానికుల దృష్టిని ఆకర్షించింది. ఈ సందర్భంగా కౌన్సిలర్ నల్లమోతు శైలజ సురేష్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టి సారించినట్లు తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేయకుండా వదిలేశారని, ఇప్పటివరకు పట్టించుకునే నాధుడు లేకపోయినా తమ హయాంలో ట్యాంక్ శుభ్రత పనులకు శ్రీకారం చుట్టామని అన్నారు. వార్డు అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీపడబోనని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. కొందరు తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ సోషల్ మీడియా గ్రూపుల్లో ప్రచారం చేస్తున్నారని, వాటిపై ప్రజలే తగిన సమాధానం చెబుతారని కౌన్సిలర్ పేర్కొన్నారు.

# సాంకేతిక విద్యను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను నిర్వీ ర్యం చేయాలనే ఉద్దేశ్యాన్ని ప్రభు త్వం మానుకుని జిఓనెం.97 ను రద్దు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి వర్క అజిత్ డిమాండ్ చేశారు. సోమవారం రుద్రంపూర్‌లోని పాలిటెక్నిక్ విద్యార్థులు కళాశాలను బహిష్కరించి ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అజిత్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్య ఎందరో జీవితాల్లో వెలుగులు నింపిందని పదో తరగతి తర్వాత సాంకేతిక విద్యను చదివిన ఎందరో నేడు చక్కటి ఉద్యోగాలు సంపాదించారని చెప్పారు. అలాంటి విద్యను ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు కుట్రలను పన్ని శక్తి శాఖలో కలిపేందుకు చూస్తున్నారని, తద్వారా పేద విద్యార్థులు సాంకేతిక విద్యను దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన విధానాన్ని మార్చుకోకుంటే ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మాణిక్యాల వినయ్, నాయకులు జదీప్, అఫ్రాన్, మహేందర్, కళాశాల సమితి సభ్యులు కేతన్ రెజీనా పల్లవి రాజేష్ నవతన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

## -వైరా ఎంఎల్‌ఏ మాలోత్ రాందాస్ నాయక్





**ప్రజాపక్షం/ఏన్కూరు :** ప్రజావాణిలో వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వైరా ఎంఎల్‌ఏ మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక రైతు వేదికలో నిర్వహించారు. ఈ ప్రజావాణి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈసందర్భంగా ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా నాయకులు మంకెన కృష్ణ పలు సమస్యలపై ఎంఎల్‌ఏకు వినతిపత్రం అందజేశారు. ప్రజలు తదితరు సమస్యలపై ఎంఎల్‌ఏని కలివారు. కొత్త మేడిపల్లి గ్రామానికి చెందిన గ్రామస్తులు రోడ్డు సౌకర్యం, కరెంట్ సౌకర్యం, పాఠశాల భవనం, అంగన్వాడీ భవనం తదితర సమస్యలు ఎంఎల్‌ఏ దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన ఎంఎల్‌ఏ గతంలో గ్రామస్తులు పాఠశాల భవనం కోరగా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా పాఠశాల కోసం ప్రత్యేకంగా కంటైనర్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే రోడ్డు, అంగన్వాడీ కావాల్సిన కంటైనర్, విద్యుత్ కోసం సోలార్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. మండలంలోని పలువురు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ప్రజలిచ్చిన సమస్యలు వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం రాజీవ్ లింక్ కెనాల్ నుంచి సాగర్ కాలువకు వెళుతున్న గోదావరి జలాలను ఆయన పరిశీలించారు. ఈకార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ గుగులోత్ లచ్చిరాం నాయక్, ఎంపీడీవో పల్లి భాగ్యశ్రీ, తహసీల్దార్ శేషగిరిరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్ల సమ్మెను జయప్రదం చేయండి

**-ఆటో కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి**
**-ఏఐటియుసి నాయకులు బిజి క్లైమెంట్**




**ప్రజాపక్షం/ఖమ్మం :** ఆటో కార్మికులు ఈనెల 23 నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నారని సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటియుసి రాష్ట్ర నాయకులు బిజి క్లైమెంట్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఆటో కార్మికుల పట్ల వివక్ష పూరిత వైఖరిని అవలంభిస్తున్నాయని సంక్షేమ పథకాలను అమలు చేయడం లేదని ఆయన ఆరోపించారు. అఖిలపక్ష కార్మిక సంఘాల సంయుక్త సమావేశం సోమవారం సిపిఐ కార్యాలయంలో గిరిప్రసాద్ భవన్‌లో ఆటో వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పేరబోయిన మోహన్‌రావు అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన క్లైమెంట్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిందని మూడేళ్లు కావస్తున్నా ఇంత వరకు ఆ హామీని అమలు చేయలేదన్నారు. ఆటో కార్మికులకు ఇందిరమ్మ భరోసా ద్వారా ఏడాదికి రూ. 12వేలు జమ చేస్తామని చెప్పిన ప్రభుత్వం రెండున్నర ఏళ్ల తర్వాత ఇప్పుడు ఆ ఊసుఎత్తడం లేదని ఆయన తెలిపారు. ఉచిత బస్సుతో పాటు రకరకాల యాప్‌లు ఆటో కార్మికుల జీవనంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని అర్ధకాలితో బతకాల్సిన పరిస్థితులను సృష్టిస్తున్నాయన్నారు. రాపిడో, ఊబర్ ,ఓలాను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని మోటార్ కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆటో కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు సమ్మె కొనసాగుతుందని ఆయన తెలిపారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ సలాం మాట్లాడుతూ ఆటో కార్మికులకు సిపిఐ అన్ని విధాలా అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏఐటియుసి ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు రావుల శ్రీనివాసరావు, షేక్ రఫీ అహ్మద్, వేముల వెంకటేశ్వర్లు, ఐఎన్‌టియుసి నాయకులు పాల్వంచ కృష్ణ, సైదులు, ఎస్‌కె సలీం, బిఆర్‌టియు నాయకులు షేక్ సత్తార్‌మియా, జిల్లా శ్రీనివాసరావు, ఎస్‌కె జాని, సిఐటియు నాయకులు దరావత్ రాందాస్ పాల్గొన్నారు.

# మార్క్‌ఫెడ్ ద్వారా పెసలు కొనుగోలు చేయాలి

**-కలెక్టర్‌కు సిపిఐ వినతి**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** మార్క్‌ఫెడ్ ద్వారా ఈ ఏడాది పెసలను కొనుగోలు చేయాలని సిపిఐ ఆధ్వర్యంలో కలెక్టర్ దివాకర టిఎస్‌కు సోమవారం వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు మాట్లాడుతూ ఖమ్మంజిల్లాలో 35వేల ఎకరాల్లో పెసర పంట సాగు చేశారని పంట చేతికి వచ్చే సమయం ఆసన్నం కావడంతో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గతేడాది మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని మద్దతు ధర రూ. 8460 ఉండగా ప్రైవేటు వ్యాపారులు క్వింటా నాలుగైదు వేలకు మించి కొనుగోలు చేయలేదని బాబు తెలిపారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా పెసర పంట అధికంగా సాగు చేశారని ఆయన తెలిపారు. గతం కంటే సాగు పెరిగిందన్నారు. ఖమ్మం జిల్లాలో ఖరీఫ్‌లో పెసర సాగు చేసి అదే భూముల్లో రబీలో మొక్కజొన్న సాగు చేయడం జరుగుతుందని ఇప్పటికైనా ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి కొనుగోలు చేయాలని ఆయన కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యురాలు ఏపూరి లతాదేవి, జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు ఉన్నారు.

# మండల కార్యాలయంలో ప్రజావాణి






**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** రఘునాథపాలెం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం రఘునాథపాలెం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎంపిడివో అశోక్‌కుమార్, తహసీల్దార్ శ్వేత లు పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, ఉద్యోగులు ఈ ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్నారు. వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించి ఒకటి, మండల పంచాయతీ విభాగానికి సంబంధించి మూడు, రెవెన్యూ విభాగానికి సంబంధించి ఒకటి, గృహ నిర్మాణ శాఖకు సంబంధించి ఒకటి, ఎక్సైజ్ శాఖకు సంబంధించి ఒక దరఖాస్తు అందింది. ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు, ఉద్యోగులు సమయపాలన పాటించలేదు. అదేవిధంగా గ్రామాల్లో మండల కేంద్రాల్లో నిర్వహించే ప్రజావాణిపై ప్రచారం లేకపోవడంతో ప్రజలు రాలేదన్న ఆరోపణలు వినవచ్చాయి. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిపై గ్రామాల్లో ప్రజలకు సమాచారం అందించాలని కోరుతున్నారు. ఈ ప్రజావాణిలో ఎంపివో శ్రీనివాసరెడ్డి, మండల వ్యవసాయ అధికారి కర్నాటి ఉమామహేశ్వరరెడ్డి, ఎంఈవో రాములు, పిఆర్‌ఏఈ చిరంజీవి, ఏపివో పద్మయ్య నాయుడు, ఎపిఎం ఎం. జ్యోతి, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. ప్రజావాణి సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

# సెప్టెంబర్1 కల్లా పిఆర్‌సి ప్రకటించకుంటే ఉద్యమం ఉధృతం




**ప్రజాపక్షం/మధిర:** పిఆర్సి, పెండింగ్ డిఏలను విడుదల చేయాలని సిపిఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం పిఆర్‌టియు ఖమ్మం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఖమ్మం కలెక్టరేట్ వద్ద తలపెట్టిన ధర్నాకు మధిర, ఎర్రుపాలెం మండలశాఖల ఆధ్వర్యంలో మధిర నుండి భారీ సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరయ్యారని ఖమ్మం జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఆర్.బ్రహ్మారెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడి 30 నెలలు దాటిన కూడా మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలు నెరవేర్చకపోవడంతో పిఆర్‌టియు ఆధ్వర్యంలో ఉద్యమ కార్యచరణ ప్రకటించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. సెప్టెంబర్1 కల్లా పిఆర్సి ప్రకటించకుంటే పిఆర్‌టియు ఆధ్వర్యంలో ఉద్యమం ఉధృతం చేస్తామని ఖమ్మం, నల్గొండ , వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి తెలిపారు. ఖమ్మం ధర్నాకు మధిర మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిలుకూరి సత్యనారాయణరెడ్డి, పోలే సుధాకర్, ఎర్రుపాలెం మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.మదన్మోహన్‌రెడ్డి, ఎం.బాబురావు, జిల్లా బాధ్యులు రవికుమార్, కొమ్ము శ్రీనివాసరావు, ఎస్.సంగిరెడ్డి, వి.నాగరాజు, మధిర, ఎర్రుపాలెం మండల బాధ్యులు పిల్లి నర్సింహారావు, జమీర్, జ్యోతి, అనసూయ, రాఘవరావు, చిన్నప్ప, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదర్శ కమ్యూనిస్టు ప్రతాప్ రెడ్డి

**సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల**



**ప్రజాపక్షం/చింతకాని :** సీపిఐ సీనియర్ నాయకులు అవులూరి ప్రతాప్ రెడ్డి బ్రతికినంతకాలం ఎర్ర జెండా ఎత్తుకొని ఆదర్శ కమ్యునిస్టుగా బ్రతికాడని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి పేర్కొన్నారు. కోమట్లగూడెం గ్రామానికి చెందిన సిపిఐ నాయకులు అవులూరి ప్రతాప్‌రెడ్డి దశదిన కర్మ సోమవారం కోమట్లగూడెంలో జరిగింది. ఈకార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా జమ్ముల జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతాప్‌రెడ్డి చిన్నతనం నుంచి పార్టీ పిలుపిచ్చిన ప్రతి కార్యక్రమంలో ముందుండేవాడని గుర్తు చేసుకున్నారు. ప్రతాప్‌రెడ్డి కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. నివాళులర్పించిన వారిలో పార్టీ జిల్లాకార్యవర్గ సభ్యులు పావులూరి మల్లిఖార్జునరావు, మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, వ్యవసాయ కార్మికసంఘం మండల అధ్యక్షులు వేముల జానకిరాములు, శాఖ కార్యదర్శి అవులూరి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో వినతుల వెల్లువ



**ప్రజాపక్షం/పెనుబల్లి:** మండల పరిషత్ కార్యాలయం లో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమం పట్ల ప్రజలు స్పందించారు. ముఖ్యంగా గతంలో ఖమ్మం వెళ్లి ప్రజావాణి లో దరఖాస్తు చేసేవాళ్ళం అని ఇప్పుడు స్థానికం గానే సమస్యల పట్ల తెలుపుతున్నామని దరఖాస్తు దారులు తెలిపారు. మొదటి సారి మొదటి రోజు జరిగినా కొందరు ఉద్యోగులు సమయపాలన పాటించలేదు. అని విమర్శలు వినిపించాయి. మొత్తం 23 శాఖలు ఉండగా 19 శాఖల నుండి ఉద్యోగులు హాజరయ్యారు. ప్రజలు 13 మంది తమ సమస్యల పట్ల వినతిపత్రం అధికారులకు అందించారు. ప్రజలు తమ సమస్యలు తెలుపుకునే అవకాశం మండల పరిధిలో కల్పించటం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమం లో తహశీల్దార్ వీరభద్రనాయక్, ఎంపీడీఓ వీరాస్వామి, ఎం ఇ ఓ మోహనరావు, పి.ఆర్. జే.ఇ రమేష్ ఐ కే పి ఎపియం శాఖ ల ఉద్యోగులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాల నిర్వీర్యానికి కాంగ్రెస్ కుట్ర



**ప్రజాపక్షం/చింతకాని :** సంక్షేమాన్ని సంక్షోభంలోకి నెట్టే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని బిఆర్ఎస్ జిల్లా నాయకులు మంకెన రమేష్ అన్నారు. పేదింటి ఆడబిడ్డలకు ఆర్థిక భరోసా కల్పించే కల్యాణలక్ష్మి , షాదీ ముబారక్ పథకా లవిషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి.. సంక్షేమ పథకాలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న ఉదాసీనతకు నిదర్శనమని ఆయన ఆరోపించారు. కల్యాణలక్ష్మి , షాదీముబారక్ పథకాలను కొనసాగించాలని చింతకాని బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ బాబ్జీప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి వెంకటరామారావు, మాజీ ఎంపీపీ రత్నాకర్, మాజీ వైస్ ఎంపీపీ గురిజాల హనుమంతరావు, నాయకులు గడ్డం శ్రీను, డీవిఆర్, షబ్బీర్ ఖాన్, వంకాయలపాటి సత్యనారాయణ, తిరుమలాపురం సర్పంచ్ చాపలమడుగు వీరబాబు పాల్గొన్నారు.

## మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి




**ప్రజాపక్షం/మధిర:** ప్రజల యొక్క సమస్యలను పరిష్కరించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్క మండల కేంద్రంలో ప్రజవాణి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని ఉద్దేశ్యంతో సోమవారం మధిర మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో బి.వెంకటేశ్వర్లు, తహశీల్దార్ రాంబాబు, కమీషనర్ సామ్యూల్ పాల్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. పలు సమస్యలపై ప్రజలు ప్రజావాణిలో తమ యొక్క సమస్యలకు సంబంధించిన విషయాలను అధికారులకు అందజేశారు. వీటి మీద విచారణ జరిపి త్వరితగతిన సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు తెలియజేశారు.

## ఉపకారవేతనం.. భవితకు వరం

**ప్రజాపక్షం/చింతకాని :** నిరుపేద కుటుంబాల విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారి కోసం కేంద్రం 2008 నుంచి నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్ఎంఎంఎస్) పేరుతో జాతీయ పకార వేతనాలను ప్రవేశపెట్టింది. ఎనిమిదో తరగతి నుంచి ఇంటర్మాడియట్ వరకు చదువుకు కొనసాగించేలా ప్రోత్సహించడానికి కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ ఈ ప్రతిభా ఉపకార వేతనాలు అందిస్తోంది. 202627 విద్యా సంవత్సరానికి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది.

**అర్హతలు..** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అర్హులు, ఏడో తరగతిలో జనరల్ విద్యార్థులు 55 శాతం మార్కులు, ఎస్సీ,ఎస్టీలు 50 శాతం మార్కులు సాధించి ఉండాలి. తల్లిదండ్రుల వార్షిక ఆదాయ ధ్రువపత్రాలు అవసరం. ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.100, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.50 చెల్లించాలి.

**ఎంపికైన వారికి...** ఎంపికైతే ఏటా రూ.12 వేల చొప్పున నాలుగేళ్ల పాటు ఉపకార వేతనాలు పొందవచ్చు. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు నాలుగేళ్ల వరకు మొత్తం రూ.48 వేల ప్రయోజనాన్ని పొందుతారు. పదోతరగతి తర్వాత ఈ ఉపకార వేతనం కొనసాగాలంటే 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత పొందాల్సి ఉంటుంది.

## శరవేగంగా రామాలయాభివృద్ధి పనులు

**- ఓ వైపు తొలగింపులు మరో వైపు కట్టడాలు**




**ప్రజాపక్షం/భద్రాచలం :** రూ.350 కోట్ల అంచనాల నిధులతో కొనసాగుతున్న భద్రాచలం రామాలయాభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. వచ్చే ఏడాది జరిగే గోదావరి పుష్కరాల నాటికి తొలిదశ అభివృద్ధి పనులు పూర్తి కావాలనే ఉద్దేశ్యంతో రేయింబవళ్లు పనులు చేస్తున్నారు. ఇందులో భాగంగా రామదాసు కాలంలో నిర్మించిన ప్రధాన ఆలయం. గాలిగోపురం మినహాయించి పూర్తి కట్టడాలను భారీ యంత్రాలతో ఒక వైపు తొలగిస్తూనే మరో వైపు నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే చిత్రకూట మండపం, బేడా మండపాన్ని తొలగించారు. ప్రతీ నిత్యం బేడా మండపంలో జరిగే స్వామివారి నిత్యం కళ్యాణాన్ని మిథిలా స్టేడియంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసి నిర్వహిస్తున్నారు. తూర్పు, పడమర మెట్లవైపు ఉన్న కట్టడాలను పూర్తిగా తొలగించారు. అంతరాలయంలో భక్తులు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి రక్షణ చర్యలు తీసుకుంటూ స్వామికి నిత్యన సేవలు చేస్తూ భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు.

## నేడు దిశా సర్వసభ్య సమావేశం

**ప్రజాపక్షం/భద్రాచలం :** మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో దిశ సర్వసభ్య సమావేశం జరగనుంది. మధ్యాహ్నం 3 గం. నుండి ఖమ్మం ఎంపి రామసహాయం రఘురామి రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి దిశా కమిటి కో చైర్మన్, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరామ్ నాయక్, జిల్లా పరిషత్ చైర్మన్ శాసన మండలి సభ్యులు, దిశా కమిటీ సభ్యులు వివిధ శాఖల అదికారులు పాల్గొని అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై చర్చించనున్నారు. అన్నిశాఖల అధికారులు తమ శాఖా పరమైన సమగ్ర నివేదికలతో హాజరు కావాలని కలెక్టర్ అంకిత్ ఆదేశించారు.

## నీట్-పీజీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** ఈనెల 30న నిర్వహించనున్న నీట్ పీజీ 2026 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి అవకతవకలు, సాంకేతిక అంతరాయాలకు తావులేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఉ.9 గం.లకు నుండి మ.12.30 గం. వరకు సుజాతనగర్‌లోని అబ్దుల్ కలామ్ కాలేజీలో పరీక్ష ఉంటుందని, 100 మంది పరీక్షకు హాజరవుతున్నారని తెలిపారు.పరీక్షా కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు, మౌళిక సదుపాయాలు ఉంటాయని, ఎలక్ట్రానిక్ వస్తువులు, వాచీలు, ఆభరణాలు, ఇతర వస్తువులు వాటర్ బాటిళ్లు పరీక్షా కేంద్రంలోనికి అనుమతి లేదని సూచించారు.

## విప్పల గుంపులో హెల్త్ క్యాంప్



**ప్రజాపక్షం/మణుగూరు:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మణుగూరు పరిధిలో గల వలస ఆది వాసి గిరిజన గ్రామమైన విప్పల గుంపు లో హెల్త్ క్యాంపు నిర్వహించి మందులు ఇవ్వడం జరిగింది. గృహ సందర్శన చేసి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చేసుకోవాలని, దోమ తెరలు ఉపయోగించుకోవాలని డాక్టర్ ఉమాదేవి సూచించారు. అనంతరం నీరు నిల్వ ఉన్నప్రదేశం లో యాంటి లార్వాల్ చల్లించడం, బ్లీచింగ్ చల్లించడం జరిగింది. ఆర్‌బిఎస్‌కె డాక్టర్ తరుణ్, సూపర్ వైజర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఛలో విద్యుత్ సౌధను విజయవంతం చేయండి

**వాల్ పోస్టర్‌ను విడుదల చేసిన జేఏసీ నాయకులు**



**ప్రజాపక్షం/మణుగూరు:** విద్యుత్ ఉద్యోగులకు పీఆర్‌సి (పే రివిజన్ కమిటీ) అమలు, ఇతర ప్రధాన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జేఏసి ఆధ్వర్యంలో ఈ నెల 19న విద్యుత్ సౌధ ( హైదరాబాద్ ) ఎదుట మహా ధర్నా జరుగుతుందని ఆ జేఏసీ బీటీపిఎస్ రీజినల్ కన్వీనర్ బి.రవి ప్రసాద్ పేర్కొన్నారు. బీటీపీఎస్ ఎదుట సోమవారం జరిగిన గేట్ మీటింగ్ లో చలో విద్యుత్ సౌధ మహా ధర్నా వాల్ పోస్టర్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక సంఖ్యలో ఉద్యోగులు హాజరై మహా ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ బ్రాంచ్ సెక్రటరీ బి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పిఆర్సి తో పాటు వైటిపిఎస్ ప్రైవేటీకరణకు వేసిన టెండర్లను రద్దు చేయాలని తదితర 14 ప్రధాన డిమాండ్లతో ఆందోళన జరుగుతుందని పేర్కొన్నారు. యాజమాన్యం దిగి వచ్చేలా ఈ ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చెప్పారు. తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ అసిస్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్ ) బ్రాంచ్ సెక్రటరీ నరేష్ మాట్లాడుతూ ఉద్యోగులంతా ఐక్యమై తమ హక్కుల సాధనకు ఉద్యమించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం 1535 రీజనల్ ప్రెసిడెంట్ వి. ప్రసాద్, కార్మిక సంఘం 1104 నాయకులు వెంకట్రామ్, ఏఐటియుసీ నాయకులు రమేష్, కార్మిక సంఘ నాయకులు కే.ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధులుగా పని చేయాలి

**- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**



**ప్రజాపక్షం/చుంచుపల్లి:** ప్రజల సమస్యలను తెలుసుకుని సత్వర పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వారి అవసరాలను గుర్తించి సేవలు అందించాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అధికారులకు సూచించారు. సోమవారం చుంచుపల్లి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై ఎంపీడీఓ సుభాషినితో కలిసి ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమానికి అందరూ అధికారులు తప్పకుండా హాజరు కావాలన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా అధికారులు పనిచేయాలని, అందిన వినతులను సంబంధిత శాఖలకు వెంటనే పంపించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి మొత్తం 22 ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీఓ తెలిపారు. గృహజ్యోతి, ఆసరా పింఛన్లు, ఒంటరి మహిళల పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, డ్రైనేజీ కాలువలు తదితర సమస్యలకు సంబంధించిన వినతులు అందినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నాగరాజు, ఎంపీఓ సంధ్య పాల్గొన్నారు.

## మారుమూల గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం

**-ఎంపీ రఘురామిరెడ్డి, ఎంఎల్ఏ జారే**



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** మారుమూల గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందని ఖమ్మం ఎంపీ రఘురామిరెడ్డి, ఎంఎల్ఏ జారే ఆదినారాయణ అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో సుమారు రూ 2.24కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. మారుమూల ప్రాంతాలకు ప్రాధాన్యం ఇస్తూ మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పేదల సంక్షేమం కోసం ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, గ్యాస్ సబ్సిడీ, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. గత ప్రభుత్వంలో జరిగని అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం చేసి చూపిస్తోందని పేర్కొన్నారు. తిప్పనపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠశాల బ్యాగులను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## వైరా ఎక్సైజ్ పరిధిలో ప్రైవేట్ తనిఖీల కలకలం..!

**వైన్ షాపులో మద్యం కొనుగోలు చేసి తీసుకెళుతున్న వారిని అడ్డుకుంటున్నారన్న ఆరోపణలు**
**బెల్ట్ షాపులపై చర్యలు ఏవి?**
**శబరి బార్‌పై ఎందుకు మౌనం?**




**ప్రజాపక్షం/వైరా:** వైరా ఎక్సైజ్ పరిధిలో జరుగుతున్న కొన్ని పరిమాణాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. వైరా, కొణిజర్ల, తల్లాడ మండలాల్లో కొందరు వ్యక్తులు తమను ఎక్సైజ్ సిబ్బందిగా పరిచయం చేసుకుంటూ వైన్‌షాపుల్లో మద్యం కొనుగోలు చేసి బయటకు తీసుకెళుతున్న వారిని అడ్డుకోవడం, వారి వద్ద ఉన్న మద్యం బాటిళ్లను తీసుకెళ్లడం వంటి ఘటనలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. అయితే ఈ తనిఖీలు, దాడులకు అధికారిక అనుమతి ఉందా? ఉంటే ఏ నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్నారు? అన్నది ఎక్సైజ్ అఇకారులు స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది.

**వైన్‌షాపులో కొనుగోలు చేయడమే నేరమా?**

ప్రభుత్వమే లైసెన్సులు ఇచ్చి వైన్‌షాపులను నిర్వహిస్తున్న నేపధ్యంలో అక్కడ చట్టబద్ధంగా మద్యం కొనుగోలు చేసిన వ్యక్తి దానిని తన ఇంటికి లేదా వ్యక్తిగత కార్యక్రమానికి తీసుకెళ్లడానికి ఏ పరిస్థితుల్లో నేరంగా పరిగణిస్తారన్న దానిపై స్పష్టత అవసరం. గత రెండు మూడు రోజులుగా వైరా పరిధిలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బీర్లు, క్వార్టర్ బాటిళ్లు కొనుగోలు చేసి వెళుతున్న వ్యక్తులను అడ్డుకొని, తాము ఎక్సైజ్ అధికారుల ఆదేశాలతోనే వ్యవహరిస్తున్నామని చెప్పినట్లు స్థానికులు చెబుతున్నారు. నిజంగా అధికారుల ఆదేశాలే ఉంటే వాటి ఆధారాలు ఏమిటి? అధికారిక సిబ్బంది కాకుండా ఇతర వ్యక్తులు తనిఖీలు నిర్వహించే అధికారం ఎవరు ఇచ్చారు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**శబరి బార్‌పై ఎందుకు మౌనం?**

వైరా శాంతినగర్‌లోని శబరి బార్ అండ్ రెస్టారెంట్‌లో బార్‌కు సంబంధించిన నిబంధనలకు విరుద్ధంగా బయటకు క్వార్టర్ బాటిళ్ల విక్రయాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు గతంలోను వినిపించాయి. ఈ అంశంపై అప్పటి ఎక్సైజ్ కమీషనర్‌కు వివరణ కోరగా, బార్ అండ్ రెస్టారెంట్ నుంచి నిబంధనలకు విరుద్ధంగా బయటకు మద్యం విక్రయించడం చట్టవిరుద్ధమని చెప్పినట్లు సమాచారం. అయితే అదే అంశంపై స్థానిక ఎక్సైజ్ అధికారులను ప్రశ్నించినప్పుడు భిన్నమైన వివరణలు వచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆధారాలు అందించినప్పటికీ చర్యలు తీసుకోలేదన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ఒకే అంశంపై ఉన్నతాధికారి, స్థానిక అధికారి వేర్వేరు అభిప్రాయాలు వ్యక్తం చేశారన్న ఆరోపణలపై ఉన్నతాధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

**బెల్ట్‌షాపులపై చర్యలు ఎక్కడ?**

మరోవైపు కొణిజర్ల, తల్లాడ మండలాల్లో వైన్‌షాపులను తలపించే స్థాయిలో బెల్ట్‌షాపులు కొనసాగుతున్నాయన్న ఫిర్యాదులు వస్తున్నా వాటిపై కఠినచర్యలు ఎందుకు కనిపించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రాత్రింబవళ్లు అక్రమ మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న ఆరోపణలపై నామమాత్రపు తనిఖీలకే పరిమితం కాకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఒకవైపు అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్రాలపై చర్యలు మందగిస్తుండగా, మరోవైపు వైన్‌షాపుల్లో మద్యం కొనుగోలు చేసిన సాధారణ వ్యక్తులను అడ్డుకోవడం ఏమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

**ఇళ్లపై సోదాలపైనా అభ్యంతరాలు**

ఎవరైనా ఫోన్ చేసి ఒక వ్యక్తి ఇంట్లో మద్యం ఉందని ఫిర్యాదు చేస్తే, వాస్తవాలను నిర్ధారించకుండానే తనిఖీలకు వెళ్లడం సరికాదని స్థానికులు అంటున్నారు. ఇలాంటి సోదాల వలన సంబంధిత కుటుంబాల సామాజిక ప్రతిష్ట దెబ్బతినే అవకాశం ఉందని, ఫిర్యాదు నిజమా కాదా నిర్ధారించుకున్న తర్వాతే చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

**ప్రైవేట్ ఎక్సైజ్ ఎవరి ఆదేశాలతో?**

వైరా ఎక్సైజ్ పరిధిలో కొందరు వ్యక్తులు అధికారుల పేరుతో తనిఖీలు, దాడులు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు నిజమైతే, వారి వద్ద ఉన్న అధికారిక గుర్తింపు ఏమిటి? వారికి ఎవరు ఆదేశాలు ఇచ్చారు? ఎక్సైజ్ అధికారులు ఈ వ్యవహారంపై ఎందుకు స్పందించడం లేదు? అన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. వైన్‌షాపుల్లో అక్రమాలు, బార్ నిబంధనల ఉల్లంఘనలు, బెల్ట్‌షాపుల వ్యవహారం, సాధారణ ప్రజలపై జరుగుతున్నట్లు చెబుతున్న తనిఖీలపై జిల్లా ఎక్సైజ్ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించారని స్థానికులు కోరుతున్నారు. అసలు వైరా ఎక్సైజ్ పరిధిలో ఏం జరుగుతుంది? అధికారిక వ్యవస్థ పనిచేస్తుందా? లేక అధికారుల పేరుతో మరెవరైనా వ్యవహరిస్తున్నారా? అనే ప్రశ్నలకు సమాధానం రావాల్సి ఉంది.

## ప్రభుత్వ కార్యాలయాల్లో టాయిలెట్స్ ఏవి..?

**-ఇబ్బందులు పడుతున్న మహిళలు**
**-కలెక్టర్ సారూ.. జర చూడండి**




**ప్రజాపక్షం/జూలూరుపాడు:** ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల కోసం వచ్చే సామాన్యులు, మార్కెట్ యార్డ్‌కు వచ్చే రైతులు, కళాశాలకు వచ్చివెళ్లే విద్యార్థులకు కనీస అవసరమైన పబ్లిక్‌టాయిలెట్లు లేక మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఖమ్మం, భద్రాచలం హైవేను అనుకుని వున్న జూలూరుపాడులో పీహెచ్సీ, బస్టాండ్, బ్యాంకు, గ్రామంలో ప్రభుత్వ కార్యాలయాలు ఉండటంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారికి గ్రామంలో పబ్లిక్ టాయిలెట్స్ లేక ఇబ్బందులు తప్పడం లేదు. నిత్యం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు ఆస్పత్రి ప్రాంగణంలో కనీస అవసరమైన టాయిలెట్లు లేని పరిస్థితి నెలకొంది. వారంలో రెండు రోజులు గర్భవతులు, బాలింతలు వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి వస్తే వీరి అవసరం మేరకు టాయిలెట్స్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతోపాటు ప్రయాణ ప్రాంగణం, ఎస్బిఐ, ఏపీజీవీబీ బ్యాంక్ ఉన్నప్పటికీ అక్కడ కూడా ఎలాంటి టాయిలెట్స్ లేకపోవడం ప్రజల ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ కనీస అవసరమైన టాయిలెట్ల నిర్మాణాలు చేపట్టడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలు లేవు. మండల కేంద్రంలో టాయిలెట్ల నిర్మాణానికి అనువైన ఖాళీ స్థలం ఉన్నప్పటికీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చేవారు టాయిలెట్ అవసరం వస్తే మగవారైతే చెట్ల చాటుకు, మహిళలైతే పలు నివాసాల వారి వద్దకు వెళ్లి ప్రాధేయపడి అవసరం తీర్చుకోవలసిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మండల కేంద్రంలో పబ్లిక్ టాయిలెట్లు, మరుగుదొడ్లు నిర్మించడానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

**మహిళల ఇబ్బందులు వర్ణనాతీతం**

ప్రభుత్వ కార్యాలయాలకు వొచ్చే మహిళలు ఇబ్బందులు వర్ణనాతీతం. రద్దీగా ఉండే ప్రాంతాలు, బస్టాండ్, బ్యాంక్, ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో అత్యవసరంగా టాయిలెట్లు నిర్మించాల్సిన అవసరం ఉంది. కేవలం ప్రచారాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో సౌకర్యాలు కల్పిస్తేనే మహిళా సమస్యలు తీరుతాయి.

**అలా అయితే ప్రాణాలకే పెను ప్రమాదం...**

సమయానికి మూత్ర విసర్జన చేయకపోవడం వల్ల ప్రాణాపాయం వెంటనే కలగకపోవచ్చు గానీ అది దీర్ఘకాలికంగా శరీరానికి తీవ్ర నష్టం కలిగిస్తుంది. వైద్య నిపుణుల ప్రకారం మహిళల్లో దీనివల్ల అనేక సమస్యలు తలెత్తుతాయి. యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్ మూత్రాన్ని ఎక్కువ సేపు ఆపడం వల్ల బ్యాక్టీరియా పేరుకుపోయి ఇన్ఫెక్షన్లకు దారి తీస్తుంది. కిడ్నీ స్టోన్స్ మూత్రంలోని మినరల్స్ గడ్డకట్టి మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడే ప్రమాదం ఉంది. బ్లాడర్ సమస్యలు మూత్రాశయం సాగిపోవడం వల్ల కాలక్రమేణా బ్లాడర్ నియంత్రణ కోల్పోయే అవకాశం ఉంటుంది.

**జిల్లా కలెక్టర్ కి మహిళలు విజ్ఞప్తి..**

మండల కేంద్రంలో మహిళల కోసం ప్రత్యేకంగా ఫ్రీ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ ను మహిళలు వేడుకుంటున్నారు. ఇప్పటికే బబ్లిక్ టాయిలెట్స్, బస్ షెల్టర్ ఏర్పాటుకు శంకుస్థాపనలు చేసి చేతులు దులుపుకోవడంపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పబ్లిక్ టాయిలెట్స్ లేక ఎవరికి చెప్పుకోలేక మహిళలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను వీలైనంత త్వరగా జిల్లా కలెక్టర్ అంకిత్ పరిష్కరించాలని మహిళా లోకం వేడుకుంటుంది.

## ఏఐటీయూసీలో 50 మంది ఆటో కార్మికులు చేరిక

**కండువా కప్పి ఆహ్వానించిన కంచర్ల జమలయ్య**



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** టియుసిఐ నుంచి ఏఐటీయూసీ పోరాటాలకు ఆకర్షితులై 50 మంది ఆటో కార్మికులు ఏఐటీయూసీలోకి చేరారు. సోమవారం వారికి ఏఐటియుసి (ఆటో వర్కర్స్ యూనియన్) రాష్ట్ర అధ్యక్షులు కంచర్ల జమలయ్య కండువా కప్పి వారిని ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశం మండల కార్యదర్శి ఎస్కే చాంద్ పాషా అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల ఆటో కార్మికులు నష్టపోతున్నారని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించి కాలం గడుపుతున్నారని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్మికులకు సంవత్సరానికి 12 వేల రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్న అమలు చేయటంలో పూర్తిగా వైఫల్యం చెందారని, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులకు ఆటో స్టాండ్లు లను ఏర్పాటు చేయాలని అర్హులైన ఆటో కార్మికులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా ఆటోలు ముంజూరు చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్ర నరేంద్ర కుమార్, సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా నాయకులు కంచర్ల రాఘవేంద్ర రావు, వలమల సామేలు, గార్లపాటి వీరభద్రం, యాసా రోశయ్య, సిరిపురపు వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ మండల అధ్యక్షులు గార్లపాటి శివ కృష్ణ, కొత్తగూడెం టౌన్ ప్రెసిడెంట్ అబ్బులు దేశి పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్లు దొంగల పాలు..!

**-అడుగంటిన ''రాథోని'' రైతన్న ఆశలు**
**-బీళ్లుగా మారిన వేల ఎకరాలు**




**ప్రజాపక్షం/పెనుబల్లి:** వర్షాభావ పరిస్థితుల్లో రైతులకు ఆలంబనగా ఉండే ప్రధాన ఎత్తి పోతల పథకాలు పెనుబల్లి మండలంలో మూలన పడ్డాయి. మండల కేంద్రానికి చుట్టుపక్కలుండే ఐదారు గ్రామాలకు ఎన్.ఎస్.పీ. ఎడమ కాలువపై ఉన్న రాథోని ఎత్తి పోతల పథకమే ఆధారం. తాళ్లపెంట, పెనుబల్లి ఎత్తిపోతల పథకాల ట్రాన్స్ ఫార్మర్లను ఏప్రిల్ నెలలో దొంగలు ఎత్తుకుపోయారు. ఇలా ట్రాన్స్ ఫార్మర్లను ఎత్తుకుపోవడం ఇది వరుసగా రెండోసారి. దీని ఫలితాన్ని రైతుల అనుభవిస్తున్నారు. రబీ సీజన్ లో ఎక్కువగా రెండో పంటకు ఈ లిఫ్టులపై రైతులు ఆధారపడుతూ ఉంటారు. ఈ ఏడాది ఎలినో ప్రభావంతో వర్షపాతం పడిపోయింది. చెరువుల్లో నీళ్లు అడుగంటాయి. మండలంలోని ఏ ఒక్క నీటి వనరు కూడా అలుగు పడలేదు. చెరువు నీళ్ల ద్వారా పంటలు పండించవచ్చుననే ఆశలు అడుగంటాయి. ఎన్ ఎస్ పీ ఆయకట్టు, బోర్ల కింద మాత్రమే వరి సాగయింది. వర్షాలు పడని ఈ ఏడాది నాగార్జునసాగర్ ఎడమ కాలువకు సీతారాం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను మళ్లించడంతో ఈ ప్రాంత రైతులు ఎంతో ఆనందపడ్డారు. కానీ, లిఫ్టులు పని చేయకపోవడం వల్ల పక్కనే పారుతున్న గోదావరి జలాలను చూస్తూ రైతులు బాధపడుతున్నారు. తాళ్లపెంట, పెనుబల్లి ఎత్తిపోతల కొత్త ట్రాన్స్ ఫార్మర్ల కోసం ఐ.డీ.సీ.అధికారులు అంచనాలు తయారు చేసి నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి నివేదించారు. ప్రభుత్వ నిధులతో ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేయడం ఆలస్యం అవుతుందనే ఆలోచనతో లిఫ్ట్ నిర్వాహక కమిటీ వారు రైతుల నుంచి నిధులు సేకరించి ట్రాన్స్ ఫార్మర్లు కొనాలనే యోచన చేశారు. అది కూడా అటకెక్కింది. దీంతో ఈ ఏడాది పంటలు పండించడం అసంభవం అనే భావనకు రైతులు వచ్చారు. వేసిన నారు ముదిరి పోతుంది.కొన్నిచోట్ల నారుమళ్లు ఎండిపోతున్నాయి. నాట్లు వేద్దామని వేల రూపాయల ఖర్చుతో దున్నిన దుక్కులు కళ్ల ముందే బీళ్లుగా మారుతున్నాయి. రైతులు ఆశలు అడియాసలయ్యాయి. సాగునే నమ్ముకునే రైతులు ఈ ఏడాది కరువును ఎదుర్కోవాల్సి వస్తుందనే వేదనతో ఉన్నారు.

## కస్తూర్బా బాలికలకు యూనిఫాం, షూస్, దుప్పట్లు పంపిణీ



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులకు ప్రభుత్వం అందించిన యూనిఫాం, షూస్, దుప్పట్లు, ఇతర సామగ్రిని తహసీల్దార్ ఉమారాణి, సర్పంచ్ వాసం సుష్మిత శ్రీకాంత్ సోమవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా తహసీల్దార్ ఉమారాణి, సర్పంచ్ వాసం సుష్మిత శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, బాలికలు ప్రభుత్వ సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. పాఠశాల మౌలిక వసతుల అభివృద్ధికి పంచాయితీ తరపున సహకారం అందిస్తామని సర్పంచ్ తెలిపారు. ప్రతి ఏటా కస్తూర్బా పాఠశాల విద్యార్థినులకు రెండు జతల యూనిఫాంతో పాటు బెల్టు, సాక్స్, షూస్‌ను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వాసం శ్రీకాంత్, మహిళా నాయకురాలు పానుగంటి మంగ, గ్రామశాఖ అధ్యక్షుడు ప్రశాంత్, గ్రామ కార్యదర్శి సాయిరాజ్, ప్రిన్సిపాల్ సరోజిని, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఎంపీ, ఎంఎల్ఏ పర్యటన ప్రభావం

**-ప్రజావాణికి అంతంతమాత్రమే స్పందన**



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మండల స్థాయి ప్రజావాణికి సోమవారం స్పందన తక్కువగా కనిపించింది. ఎంపీ రఘు రామిరెడ్డి, ఎంఎల్ఏ జారే ఆదినారాయణ మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించడంతో ప్రజలు, నాయకులు, కార్యకర్తలు వారి వెంట వెళ్లడంతో ప్రజావాణికి హాజరు తగ్గినట్లు తెలుస్తోంది. ఎంపీడీవో అశోక్ తెలిపిన వివరాల ప్రకారం ప్రజావాణిలో రెండు దరఖాస్తులు అందాయి, తుంగారం గ్రామం నుంచి సీతారామ ప్రాజెక్టు కాలువల రూపకల్పనకు మార్చాలని, సీతయ్యగూడెం నుంచి అసైన్డ్ భూములకు పట్టాలు మంజూరు చేయాలని వినతులు అందినట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం మధ్యవర్తులను ఆశ్రయించకుండా నేరుగా ప్రజావాణిలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని 23 శాఖల అధికారులు హాజరయ్యారు.

## బాషా పండితులు, పీఈటీలకు వెంటనే పదోన్నతులు ఇవ్వాలి



**ప్రజాపక్షం/కారేపల్లి:** గిరిజన సంక్షేమ శాఖలో పని చేస్తున్న 262 మంది బాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులకు వెంటనే పదోన్నతులు కల్పించాలని ట్రైబల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తెలంగాణ(టీట్స్)డిమాండ్ చేసింది. టీట్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూకర రాంబాబు, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎంపీ నాయక్, మాలోత్ ప్రతాప్ సింగ్, నరేష్, హరికిషన్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఇతర శాఖల పరిధిలోని భాషా పండితులు, పీఈటీలకు పదోన్నతులు కల్పించినా గిరిజన సంక్షేమ శాఖలోని 262 మందికి అన్యాయం జరిగిందన్నారు. రెండేళ్లుగా అధికారులకు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. వెంటనే పదోన్నతులు కల్పించకపోతే కుటుంబాలతో కలిసి నిరసనలు, రాస్తారోకోలు, ధర్నాలు, ఆమరణ దీక్షలు చేపడతామని హెచ్చరించారు. పీఆర్సీ, డీఏ బకాయిల చెల్లింపు, కాంట్రాక్ట్ ఉపాధ్యాయులకు కనీస వేతన స్థాయి, ఉద్యోగ భద్రత, రోజువారీ వేతన కార్మికులకు వేతన పెంపు, ఏజెన్సీ ఉద్యోగులకు గృహ రుణాల సౌకర్యం కల్పించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, కాంట్రాక్టు సిబ్బంది, రోజువారీ వేతన కార్మికులు పాల్గొన్నారు.

## మాదారంలో ఘనంగా తీజ్ వేడుకలు



**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండలం మాదారం గ్రామంలో తీజ్ వేడుకలు సంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించారు. మిషన్ వాక్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ బాదావత్ రవి, ఆర్మీ సైనికుడు దశరథ్ వేడుకల్లో పాల్గొని గిరిజన సంప్రదాయాలను ఆస్వాదించారు. మాజీ సర్పంచ్ అజ్మీరా నరేష్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో గ్రామ పెద్దలు, మహిళలు, యువతీ, యువకులు పాల్గొన్నారు. ఈసందర్భంగా డాక్టర్ బాదావత్ రవి మాట్లాడుతూ తీజ్ వంటి పండుగలు గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, వాటిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఐక్యతను పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలను మరింతగా నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో మిషన్ వాక్ సభ్యులు డాక్టర్ హాజ్రా, షేర్ ఖాఆన్, సాయి, నరేష్, రంగ, భద్రు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాల నిర్వీర్యానికి కాంగ్రెస్ కుట్ర

**-మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ విమర్శించారు. పేదింటి ఆడబిడ్డలకు ఆర్థిక భరోసా కల్పించే కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల విషయంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సంక్షేమ పథకాలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న ఉదాసీనతకు నిదర్శనమన్నారు. ఆడబిడ్డ భారం కాదు భరోసా అనే భావనకు గత కేసిఆర్ ప్రభుత్వం కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా రూపం ఇచ్చిందన్నారు. పేదింట ఆడపిల్లల పెళ్లి భారం కాకుండా ఉండేందుకు ఆర్థిక చేయూత అందించిందన్నారు. అట్టి పథకాలను నిర్వీర్యం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు పన్నుతుందన్నారు. కళ్యాణలక్ష్మి అంశం హైకోర్టులో ఉన్న సమయంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరు పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. హైకోర్టు నాలుగు సార్లు గడువు ఇచ్చిన ప్రభుత్వం కౌంటర్ ఎందుకు దాఖలు చేయలేదని ప్రశ్నించారు.

# బహిరంగ విచారణకు ఎన్‌డి సిద్ధం కావాలి

**-అసత్య ప్రచారాలు, ఆరోపణలు సరికాదు**
**-మాజీ ఎంఎల్‌ఎ గుమ్మడి నర్సయ్య**




**ప్రజాపక్షం/ ఖమ్మం :** సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ నాయకుడు, దివంగత రాయల చంద్రశేఖర్ ఆత్మహత్యకు సంబంధించి ఆరోపణలు చేస్తున్న న్యూడెమోక్రసీ నేతలు బహిరంగ విచారణకు సిద్ధం కావాలని మాజీ శాసన సభ్యులు గుమ్మడి నర్సయ్య కోరారు. చంద్రశేఖర్ ఆత్మహత్య చేసుకుని రెండేళ్లు పూర్తయిన తర్వాత ఇప్పుడు మాస్‌లైన్ పార్టీని లక్ష్యంగా చేసుకుని న్యూడెమోక్రసీ నేతలు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రశేఖర్ ఆత్మహత్యకు సంబంధించి మధ్యవర్తుల ద్వారా విచారణకు తాము సిద్దంగా ఉన్నామని ఆయన తెలిపారు. సోమవారం మాస్‌లైన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ వేములపల్లి వెంకట్రామయ్య, ప్రసాద్, సాధినేని వెంకటేశ్వరరావు, ఆవునూరి మధు లు విచారణకు రావాలని తాము ఆహ్వానిస్తున్నామని ఆయన తెలిపారు. భక్తరామదాసు కళాక్షేత్రంలో ఈనెల 16న చంద్రశేఖర్ పుస్తకావిష్కరణ సందర్భంగా విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రశేఖర్‌కు పార్టీతో ఏర్పడిన విబేధాలు ఆయన మరణానికి కారణమని చెప్పడం దుర్మార్గమన్నారు. అసంతృప్తివాదులను, అలకలు పూనిన వారిని దగ్గర చేర్చుకుని లబ్ది పొందాలనుకోవడం సరైంది కాదన్నారు. మాస్‌లైన్ ఎదుగుదలను చూసి ఓర్వలేక చేస్తున్న విమర్శలుగా తాము పరిగణిస్తున్నామని నర్సయ్య తెలిపారు. ఒకప్పుడు చంద్రశేఖర్‌ను లక్ష్యంగా చేసుకుని విమర్శించిన వారే ఇప్పుడు చంద్రశేఖర్‌ను వీరుడు, శూరుడు అని పొగడటం వెనక ఉన్న అంతరార్థం ఏమిటని వారు ప్రశ్నించారు. చంద్రశేఖర్ సహా అమరులైన వారి ఆశయాలకు మాస్‌లైన్ పునరంకితం అవుతుందని నర్సయ్య తెలిపారు. మీడియా సమావేశంలో సిపిఐ (ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి సివై పుల్లయ్య, జిల్లా నాయకులు ఆవుల అశోక్, జి. రామయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, బందెల వెంకయ్య, ఆర్. శివలింగం,నాగేశ్వరరావు, ఝాన్సీ, శ్రీనివాస్, హన్మంతరావు పాల్గొన్నారు.

# సాగునీటి కోసం అఖిలపక్షం ఆధ్వర్యంలో రైతుల ఆందోళన

**-ఎస్సై కాళ్లపై పడి కన్నీరు పెట్టిన వృద్ధ రైతు**
**-గేట్లు ఎత్తి నీటిని విడుదల చేసిన అధికారులు**





**ప్రజాపక్షం/వైరా:** వైరా రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలోని పంటలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ సోమవారం వైరాలోని నీటిపారుదలశాఖ కార్యాలయం ఎదుట బిఆర్ఎస్, సిపిఎం, ఎంఎల్ పార్టీ మాస్‌లైన్ ఆధ్వర్యంలో రైతులు, అఖిలపక్ష నాయకులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఆందోళన సమయంలో నీటిపారుదలశాఖ డిఈ నాగబ్రహ్మం కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా రైతులు, నాయకులు అడ్డుకొని నీటి విడుదలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. ప్రభుత్వపరంగా నీటిని విడుదల చేయడానికి తనకు ఎలాంటి ఆదేశాలు లేవని డిఈ చెప్పడంతో నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. లింగన్నపేట రెవెన్యూ పరిధికి చెందిన ఓ వృద్ధ రైతు తన పొలాన్ని దమ్ము చేసుకున్నా నీరు లేక ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తూ వైరా ఎస్సై పుప్పాల రామారావు కాళ్లపై పడి కన్నీరుమున్నీరయ్యాడు. రైతు దుస్థితిని చూసిన అక్కడున్న వారు చలించిపోయారు. వెంటనే స్పందించిన ఎస్సై రామారావు రైతులను లేపి పెద్ద మనిషి అలా కాళ్లపై పడకండి, మీకు న్యాయం జరిగేలా చూస్తాం అంటూ ధైర్యం చెప్పారు. అనంతరం అఖిలపక్ష నాయకులు, రైతులతో కలిసి ఎస్సై రామారావు డిఈ నాగబ్రహ్మంతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా డిఈ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అధికారికంగా నీటిని విడుదల చేయవద్దని సూచించారని తెలిపారు. అయితే రైతుల పరిస్థితి దృష్టిలో ఉంచుకొని అనధికారికంగా నీటిని విడుదల చేసి సహకరిస్తామని చెప్పినట్లు నాయకుల తెలిపారు. కొద్దిసేపటి అనంతరం నీటిపారుదలశాఖ సిబ్బందితో కాల్వ గేట్లను ఎత్తించి నీటిని విడుదల చేశారు. దీంతో ఆందోళనలకు దిగిన రైతులు కొంత ఉపశమనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు భూక్యా వీరభద్రం, కట్టా కృష్ణార్జునరావు, లాల్ మియా, బాణాల వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ సాగునీటి విషయంలో తమకు ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కట్టా కృష్ణార్జనరావు, భూక్యా వీరభద్రం, లాల్‌మియా, బాణాల వెంకటేశ్వరరావు, సిరిపురం సర్పంచ్ శెట్టిపల్లి శ్రీనివాసరావు, సుంకర సుధాకర్, మద్దెల రవి, గుడిమెట్ల రజిత, బట్టా భద్రయ్య, సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, అప్పం సురేష్, తూము సుధాకర్, మరికంటి శివ, ఏదునూరి శ్రీనివాసరావు, విలాసాగరం నరేష్, కందుల ఓంకార్, కంచర్ల నాగేశ్వరరావు, తన్నీరు నాగేశ్వరరావు, వేముల శివకుమార్, వల్లభి శ్రీనివాసరావు, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

# ప్రజావాణిలో వినతుల వెల్లువ



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** తన కుటుంబ సభ్యులు ఆస్తిని అనుభవిస్తూ అన్నం పెట్టకుండా...ఇంటి నుంచి బయటకు గెంటేశారని ఓ వృద్ధురాలు అధికారులకు విన్నవించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా వాణి కి పలు సమస్యల పై వినతులు అందించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ యం.యర్రయ్య అధ్యక్షతన ప్రజావాణి ని స్వీకరించారు. చెన్నారం గ్రామానికి చెందిన సీతమ్మ అనే వృద్ధురాలు తనకున్న రెండు ఎకరాలను స్వాధీనం చేసుకుని, తను అన్నం కూడ పెట్టకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లగొట్టారని సిపిఐ మండల కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వరరావు తో కలిసి ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు. కోనాయిగూడెం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లలితాకుమారి పేరెంట్స్ పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. ప్రశ్నించిన తల్లిదండ్రుల పట్ల నిర్లక్ష్యంగా వ్యహరించటమే కాకుండా విద్యార్థుల పై చెయ్యి చే సుకుంటున్నారని ఆరోపించారు. గ్రామంలో జరిగే పంక్షన్‌లకు విద్యార్థులను బోజనాలకు తీసుకెళ్తున్నారని ఆరోపించారు. విద్యార్థులకు చదువు చెప్పకుండా నిర్లక్ష్యంగా వ్యవహారించటంతో పాటు నిత్యం సెలవులు పెడుతున్నారని,..విద్య పట్ల నిర్లక్ష్యంగా చూపే ఉపాధ్యాయురాలని మార్చకుంటే తమ పిల్లలను బడికి పంపకుండా తాము ప్రవేట్ కు పంపుతామని ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామానికి చెందిన పేరెంట్స్ బొడ్డు ప్రమీలా, ఉపేందర్, చెరుకుపల్లి రాజేష్ తదితరులు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాంప్రసాద్, మండల విద్యాశాఖాధికారి బాలిన చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

# శక్తి వద్దు, పాలిటెక్నిక్ ముద్దు




**ప్రజాపక్షం/మధిర:** తెలంగాణ పాలిటెక్నిక్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు మధిర పాలిటెక్నిక్ కాలేజ్ నందు అధాయపకులు, సిబ్బంది విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు పెట్టుకొని నిరసన తెలియజేశారు. పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే జీవో నెంబర్ 97ను రద్దు చేయాలి. శక్తిపాలసీని వెనక్కి తీసుకోవాలి. పాలిటెక్నిక్ విద్యను సాంకేతిక విద్యాశాఖలోనే ఉంచాలని వారు డిమాండ్ చేశారు. అంతేగాక ఉద్యోగుల డిమాండ్ల మీద చర్చించకుండా ప్రభుత్వం నేరుగా స్కిల్ యూనివర్శిటీ పరిధిలోకి కాలేజీలు మార్చడం వలన విద్యార్థులు భవిష్యత్తు ఆగమ్యగోచరంగా తయారవుతుందని, దాని వలన పేద విద్యార్థులకు నష్టం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.సాంబయ్య, జనరల్ హెడ్ వినోద్‌కుమార్ ఏవో జనహత్, అప్రోచ్, డి.విజయలక్ష్మి, అధ్యాపకులు రమేష్, రామకృష్ణ, చెన్నకేశవరావు, అపర్ణ, సింధూర, వీరేందర్, మనోహర్, రాజ్‌కుమార్, సిబ్బంది పాల్గొని నిరసన తెలియజేశారు.

# కర్నాటి బాబురావుకు నివాళి

**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు గండగలపాడు గ్రామానికి చెందిన కర్నాటి బాబురావు ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. సోమవారం ఆయన చిత్రపటానికి బిఆర్ఎస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బాబురావుతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జునరావు, వనమా విశ్వేశ్వరరావు, బాణాల వెంకటేశ్వరరావు, దొంతబోయిన చింతయ్య, కట్టా నాగేశ్వరరావు, నరసింహరావు, స్నేహసాగర్, మరికంటి శివ, ఏదునూరి శ్రీనివాస్, వేముల శివకృష్ణ, కర్నాటి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల రద్దుపై నేడు బీఆర్ఎస్ నిరసన

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను నిర్వీర్యం చేసి పేదలకు అందుతున్న ఆర్థిక సహాయాన్ని నిలిపివేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సండ్ర వెంకట వీరయ్య తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు సత్తుపల్లిలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఈ నిరసనకు సండ్ర వెంకట వీరయ్య ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# ఉత్తమ ఎంపీడీవో యర్రయ్యకు ఘన సన్మానం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** జిల్లా ఉత్తమ ఎంపీడీఓ గా అవార్డు అందుకున్న నేలకొండపల్లి ఎంపీడీఓ యర్రయ్యను పలువురు ఘనంగా సన్మానించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలం లో ప్రభుత్వ పథకాల అమలు లో ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. ఆయన ఇలాంటి అవార్డులు మరెన్నో అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి జెర్రిపోతుల అంజిని, సుల్తాన్ వీరబాబు, కడియాల నరేష్. కొండమీది వెంకన్న, సోమనబోయిన సాయినవీన్, షేక్ లాల్పాషా, గడిపల్లి నవీన్, బచ్చలకూరి వీరబాబు, విష్ణు తదితరులు పాల్గొన్నారు. ఎంపీడీఓ నుసర్పంచ్ ల సంఘం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ను నిర్వహించారు. మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, సర్పంచ్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శి లు రాయపూడి రామారావు, దుద్దెల పవన్ పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ సెంటర్‌లో సీమంతాలు



**ప్రజాపక్షం/తల్లాడ :** తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో సీమంతాలు, అక్షరాభ్యాసం , అన్నప్రసాన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడవ అంగన్‌వాడీ సెంటర్లో నిర్వహించిన కార్యక్రమానికి మాజీ ఎంపిపి దొడ్డ శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ గొడ్ల ప్రభాకర్, ఉప సర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వర్లు, ఏసిడిపివో పద్మ లు హాజరయ్యారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసాన్ని చేయించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ భద్రమ్మ, ఎఎన్ఎం విజయలక్ష్మి, రాంబాయి, అంగన్‌వాడీ టీచర్ మీనాకుమారి, ఆయా, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

# గంజాయి కేసులో రెండేళ్లు జైలు

**ప్రజాపక్షం/ ఖమ్మం లీగల్ :** గంజాయి కేసులో ఇద్దరు నిందితులకు ఒక్కొక్కరికి రెండేళ్లు జైలు శిక్ష విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా, సెషన్ కోర్టు న్యాయమూర్తి పుల్లాభట్ల పొగడ కృష్ణార్జున్ సోమవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం... 2024 ఫిబ్రవరి 24న ఖమ్మం మమత ఆసుపత్రి రోడ్డులో వన్‌టౌన్ పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన దుగ్గిరాల సూర్యనారాయణను తనిఖీ చేయగా గంజాయి లభ్యమైంది. గంటెల నరేష్‌తో కలిసి ఒడిషా నుంచి ఐదు కేజీల గంజాయి తీసుకు వచ్చి చెరో 2.5 కేజీలు తీసుకుని ఖమ్మంలో అధిక ధరకు విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడించారు. నిందితుల నుంచి నాలుగు కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితునిపై మోపిన అభియోగం రుజువు కావడంతో నిందితులిద్దరికి రెండేళ్లు జైలు శిక్ష పదివేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరుపున ఇన్‌స్పెక్టర్ ఉదయ్‌కుమార్, కరుణాకర్, పిపి శరత్‌కుమార్‌రెడ్డి, కోర్టు కానిస్టేబుల్ రామకృష్ణ సహకరించారు.

# ప్రజావాణి వినతులు సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజావాణి వినతులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. సోమవారం ఐడిఓసిలో అదనపు కలెక్టర్ వేణుగోపాల రావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, డిఆర్ఓ పద్మావతితో కలిసి పలు ప్రాంతాల నుండి తరలవచ్చిన ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులపై నమ్మకంతో జిల్లా నలు మూలల నుండి ప్రజలు వ్యయప్రయాసలకు ఓర్చి ఇక్కడి దాకా వచ్చి వినతులు సమర్పిస్తుంటారని వారి నమ్మకాన్ని ఒమ్ముచేయకుండా ప్రతీ దరఖాస్తును పరిశీలించి పరిష్కరించాలన్నారు. పరిష్కారానికి నోచుకోనివాటిపై సమగ్ర వివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.



**భద్రాచలంలో :** ఐటిడిఏలో గిరిజన దర్బారులు నిర్వహించారు. పిఓ రాహుల్ పలు ప్రాంతాల నుండి తరలివచ్చిన గిరిజనుల నుండి పలు వినతులు స్వీకరించారు. గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు పిఓ తెలిపారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ పథకాలు ప్రాధాన్యతా క్రమంలో అందుతాయని స్పష్టం చేశారు. అధికారులు అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని పరిష్కారానికి వీలుగాని వాటిపై సమగ్ర నివేదికలు అందించాలని తెలిపారు.

# యువతిపై రేప్.. ఆపై దాడి

**- యువకుడి ఇంటి ముందు బైఠాయింపు**

**ప్రజాపక్షం/పాల్వంచ :** ఓ యువకుడు మానవత్వాన్ని మంటగలిపాడు. తనను నమ్మి వచ్చిన యువతిని రాక్షసంగా రేప్ చేసి ఆపై దాడికి పాల్పడిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. దీనితో యువతి బంధువులు వివాహం చేసుకోవాలంటూ యువకుడి ఇంటి ముందు బైఠాయించారు. యువతి బంధువులు పరిచయం కాస్తా ఆమె పరువును మంట కలిపింది. నమ్మనవాడే కాలయముడయ్యాడు. రేప్ చేసి ఆపై దాడికి పాల్పడటం మండలంలో కలకలం రేపింది. స్థానికులు తెలిపిన ప్రకారం మండల పరిధి రాజాపురం గ్రామానికి చెందిన ఆదివాసీ గిరిజన కుంటుంబానికి చెందిన ఓ యువతి కోడిపుంజులవాగుకు చెందిన భూక్యా అభిల మద్య గత కొంత కాలంగా పరిచయం ఉంది. ఆ పరిచయం కాస్తా ప్రేమగా మారింది. దీనిని గమనించిన యువతి బంధువులు పలుమార్లు యువకుడిని హెచ్చరించారు. అయినా వారి తీరులో ఎలాంటి మార్పురాలేదు. ఈ నెల 16వ, తేదీ ఆదివారం రాత్రి పునుకుల గ్రామంలో జరుగుతున్న బోనాల పండుగకు మేనమామ ఇంటికి వెళ్ళటానికి అభిని రాజాపురం రావాలని యువతి చెప్పింది. దీనితో తన ఆటోలో రాజాపురం నుండి పునుకులకు తీసుకెళ్తున్నాడు. మార్గ మద్యలో పునుకులకు కాకుండా పుల్లాయిగూడెం రహదారిలో నిర్మానుష్య ప్రదేశమైన డంపింగ్ యార్డ్‌కి తీసుకెళ్ళాడు. తనకు శారీరకంగా లొంగిపోవాలని బలవంతం చేశాడు. లేదంటే మనం కలిసి దిగిన ఫోటోలను సామాజిక మాద్యమాలలో పెడతానని బెదిరించాడు. అయినా అంగీకరించకపోవటంతో కోపోద్రిక్తుడైన అభి యువతిపై దాడికి దిగాడు. ఆపై రేప్ చేసి పారిపోయాడు. అనంతరం జరిగిన విషయాన్ని యువతి తమ బంధువులకు సమాచారం అందజేసింది. బంధువులు యువతని తీసుకెళ్ళి కోడిపుంజులవాగులోని యువకుడి ఇంటికి తీసుకెళ్ళి వెళ్ళిపోయారు. సోమవారం యువతి బంధువులు యువకుడి ఇంటి ముందు వివాహం చేసుకోవాలంటూ బైఠాయించారు. సమాచారం అందుకొన్న పోలీసులు ఇరు వర్గాలకు సర్ది చెప్పి స్టేషన్‌కు తీసుకొచ్చారు. అనంతరం ఎస్ఐ విజయ జరిగిన ఘటనపై యువతి,యువకుడిని వేరు వేరుగా విచారణ చేశారు. రేప్‌కు పాల్పడ్డది నిజమేనని, వివాహం మాత్రం చేసుకోలేనని యువకుడు చెప్పాడు. దీనితో యువతి బంధువులు అఘాయిత్యానికి పాల్పడిన వాడే వివాహం చేసుకోవాలంటూ లేదంటే మా పరువుకు భంగం కలుగుతుందని, మరో వివాహం చేయలేని పరిస్థితి ఏర్పడిందని అభికి నచ్చజెప్పి చూశారు. ఈ విషయంపై ఇద్దరికి ఇష్టమైతే మాకే మాత్రం అభ్యంతరం లేదని యువకుడి తల్లిదండ్రులు తెలిపారు. యువతి బంధువులు ఫిర్యాదు చేశారని ఎస్ఐ. సురేష్ చెప్పారు.

# బిసి గురుకుల డిగ్రీ కాలేజీ తరలింపు నిలిపేయాలి

**- ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అజిత్**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాకు మంజూరైన బిసి గురుకుల బాలుర డిగ్రీ కళాశాలను ఇతర ప్రాంతాలకు తరలించే కుట్రలను తక్షణమే విరమించుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వరక అజిత్ డిమాండ్ చేశారు. కొత్తగూడెంలోని శేషగిరి భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023సం.లో జిల్లా కేంద్రానికి మంజూరైన ఈ గురుకుల డిగ్రీ కళాశాలను నిబంధనలకు విరుద్ధంగా అన్నపురెడ్డిపల్లిలోని శిథిలావస్తకు చేరిక 50 ఏళ్ల నాటి సత్రం భవనంలో ఏర్పాటు చేశారని మండిపడ్డారు. ఉన్నతాధికారులతో ఉన్న సాన్నిహిత్యాన్ని పలుకుబడిని ఉపయోగించుకుని కొందరు స్వార్థపూరిత శక్తులు ఈ విద్యా సంస్థను భద్రాద్రి జిల్లా నుండి మహబూబాబాద్ జిల్లా తొర్రూరుకు తరలించేందుకు తెరవేనుక కుట్రలను పన్నుతున్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇందులో భాగంగానే మొదటి సం. ప్రవేశాలు ఉద్దేశ్య పూర్వకంగానే రద్దు చేశారని, విద్యార్థులకు టీసీలు ఇచ్చి బలవంతంగా పంపించే ప్రయత్నాలు ముమ్మరం చేశారని ఆరోపించారు. స్థానిక ప్రజాప్రతినిధులు జిల్లా అధికారులు స్పందించి ఈ కుట్రలను తిప్పి కొట్టకపోతే జిల్లా విద్యారంగానికి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. కొత్తగూడెం రామవరంలోని ఎంజేపిటిబిసిడబ్ల్యూఆర్ఇఐఎస్ జూనియర్ కాలేజీలో 500 మంది సమర్ధ్యం గల భవనం ఉందుబాటులో ఉందని తక్షణమే అక్కడికి తరలించాలని లేదా ఇతర భవనాల్లో తరగతులు నిర్వహించాలని స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం ఆడితే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు మణిక్యాల వినయ్ సంజయ్ సృజన్ వంశీ రాజ్ కమల్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ కాలేజీ అభివృద్ధికి పెద్దపీట

**రూ.15 లక్షలతో గ్రౌండ్ లెవలింగ్ పనులకు భూమి పూజ**



**ప్రజాపక్షం/మణుగూరుః** మణుగూరు మండలం సమితి సింగారంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పెద్దపీట వేస్తున్నారు. కళాశాల ప్రాంగణాన్ని మరింత సౌకర్యవంతంగా తీర్చిదిద్దేందుకు రూ.15 లక్షలతో చేపట్టనున్న గ్రౌండ్ లెవలింగ్ పనులకు సోమవారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు మెరుగైన మౌలిక వసతులు, ఆహ్లాదకరమైన విద్యా వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కళాశాల అభివృద్ధికి అవసరమైన పనులను ప్రాధాన్యత క్రమంలో చేపడుతున్నామని పేర్కొన్నారు. గ్రౌండ్ లెవలింగ్ పనులు పూర్తయితే కళాశాల ప్రాంగణం మరింత సౌకర్యవంతంగా మారుతుందని, విద్యార్థులకు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర విద్యా కార్యక్రమాలు నిర్వహించేందుకు అనుకూలంగా ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తానని పాయం వెంకటేశ్వర్లు హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులో ఉండేలా కళాశాలలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కళాశాల అధ్యాపకులు, మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మైనారిటీ అధ్యక్షులు, మహిళా అధ్యక్షురాలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో జర్నలిస్టుల అర్జీ



**ప్రజాపక్షం/కామేపల్లి:** కామేపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మండల జర్నలిస్టులు అర్జీ సమర్పించారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించడంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు కోటగిరి రాము, చిలుముల రమేష్, శ్రీనివాస్, షేక్ ఇబ్రహీం, తెల్లబోయిన రాము, తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ కొనసాగించాలి



**ప్రజాపక్షం/కామేపల్లి:** కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం కామేపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో పాటు సంక్షేమ పథకాలన్నింటినీ కొనసాగించాలని డిమాండ్ చేశారు. పథకాలను నిలిపివేస్తే ఇతర పార్టీలతో కలిసి ప్రజా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు అంతటి అచ్చయ్య, మల్లెంపాటి శ్రీను, సామా మోహన్‌రెడ్డి, మూడు కృష్ణప్రసాద్, వడియాల కృష్ణారెడ్డి, తదితర నాయకులు, సర్పంచులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ పథకాలను రద్దు చేయవద్దు



**ప్రజాపక్షం/భద్రాచలం :** పేదింటి ఆడ పిల్లలకు మేలు చేసే కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను రద్దు చేయవద్దని బిఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు రావులపల్లి రామ్ ప్రసాద్, మానె రామకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించి సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేసారు. ఈ సందర్భంగా రావులపల్లి రామ్ ప్రసాద్, మానె రామకృష్ణ మాట్లాడుతూ పేదింటి ఆడ బిడ్డల వివాహాలకు భరోసా కల్పిస్తున్న షాదీముబారక్, కళ్యాణ లక్ష్మి పథకాలను నిరంతరం కొనసాగించాలన్నారు. ఆడ బిడ్డలకు బిఆర్ఎస్ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం,దుమ్ముగూడెం,చర్ల మండల పార్టీల నాయకులు మహిళా నాయకులు మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# విద్యార్ధి ఉద్యమాల దిక్సూచి ఏఐఎస్ఎఫ్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** విద్యార్థి ఉద్యమాలు దిక్సూచి ఏఐఎస్ఎఫ్ అని ఆ సంఘం మాజీ జిల్లా కార్యదర్శి ఫహీమ్ దాదా అన్నారు. సోమవారం రుద్రంపూర్ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఏఐఎస్ఎఫ్ 91వ ఆవిర్భావ దినోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫహీమ్ మాట్లాడుతూ భారతస్వతంత్ర్య సంగ్రామంలో ఏఐఎస్ఎఫ్ కీలకపాత్రపోషించిందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై , కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో విద్యాఉపాధి హక్కుల సాధనకై సమరశీల పోటాలకు సిద్ధం కావాలన్నారు. కేంద్రం నూతన విద్యావిధానాన్ని విరమించుకోవాలన్నారు. అందరికీ ఉపాధి లభించేలా భగత్‌సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్టును అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్ కోసం ఉపాధ్యాయ అధ్యాపక పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి ఇచ్చిన హామీలను అమలుచేయాలని పెండింగ్ స్కాలర్‌షిప్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్క అజిత్, మాణిక్యాల వినయ్, కొయ్యడ రవి, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే ట్రాక్ వద్ద యువకుడి మృతదేహం



**ప్రజాపక్షం/అశ్వాపురం:** మండలంలోని గొందిగూడెం రైల్వే ట్రాక్ వద్ద సోమవారం యువకుడి మృతదేహం కలకలం రేపింది. ట్రాక్ సమీపంలో మృతదేహాన్ని గుర్తించిన రైతులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న సీఐ ఎల్లయ్య సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం కొత్తగూడెం రైల్వే ఎస్ఐ నాగార్జునరెడ్డి కూడా అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడిని అశ్వాపురం గ్రామానికి చెందిన పాకాలపాటి సాయి(26)గా గుర్తించారు. ఆయన హెవీ వాటర్ ప్లాంట్ బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్నట్లు, భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలిసింది. అయితే సాయి మృతి ప్రమాదమా, ఆత్మహత్యా, హత్యా అన్నది తెలియాల్సి ఉంది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# అభివృద్ధిపై చర్చకు సిద్ధం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం నియోజకవర్గ అభివృద్ధిపై చర్చకు సిద్దమని డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ తెలిపారు. సోమవారం సంజీవరెడ్డి భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై అసత్య ప్రచారాలు చేయడం సరికాదన్నారు. వ్యవసాయ మార్కెట్ ఆధునీకరణ, కేబుల్ బ్రిడ్జి నిర్మాణం, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఇలా అనేకం కండ్ల ముందే కనిపిస్తున్న విమర్శలు చేయడం సరికాదన్నారు. వ్యక్తిగత విమర్శలు మానుకోవాలని ఆయన సూచించారు. మీడియా సమావేశంలో నగర అధ్యక్షులు దీపక్‌చౌదరి, సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు దొబ్బల సౌజన్య, బానోత్ బాలాజీ నాయక్, ఖాదర్‌బాబా పాల్గొన్నారు.

# దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

**-ప్రజావాణిలో అర్జీలను స్వీకరించిన కలెక్టర్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజావాణిలో తమ సమస్యలను తెలుపుతూ ప్రజలు సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్లు పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లు పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. రఘునాథపాలెం మండలం పాపటపల్లికి చెందిన చౌడవరపు దుర్గమ్మ తన కుమారుడు తనను అనేక బాధలు పెడుతున్నాడని అతనిపై చర్యలు తీసుకోవాలని దరఖాస్తు చేశారు. కల్లూరు మండలం మల్లుపల్లికి చెందిన రైతులు సర్వే నెం. 19లో తమ పూర్వీకుల నుంచి వారసత్వంగా సాగు చేసుకుంటున్నామని అట్టి సర్వే నెంబరులో అటవీ భూమికి సరిహద్దు ఉన్నందున పట్టా పాసుపుస్తకం రాలేదని తమకు న్యాయం చేయాలని దరఖాస్తు చేశారు. మిషన్ భగీరథ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ సభ్యులు తమకు నాలుగు నెలలుగా పెండింగ్ ఉన్న జీతాలు ఇప్పించాలని దరఖాస్తు చేశారు. కూసుమంచి మండలం పాలేరుకు చెందిన కె. ఉపేందర్ తాను రెండేళ్లుగా ర్యాపిడో బైక్ నడుపుకుంటున్నానని ఎస్సి కార్పోరేషన్ ద్వారా ఆటో ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ఆయా దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్ సత్వరమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిసిఈవో దీక్షారైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో కె. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆర్డివో కార్యాలయం ముట్టడి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు పన్నుతున్న కుట్రలను ఖండిస్తూ బిఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఖమ్మం ఆర్డివో కార్యాలయాన్ని ముట్టడించారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సూచనల మేరకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆదేశాల మేరకు ఖమ్మంనియోజక వర్గ బిఆర్ఎస్ నాయకులు ఆర్డివో కార్యాలయ ముట్టడిని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేసిఆర్ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలను అమలుచేసి ఇంటింటికి వెళ్లి మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అందించారన్నారు. కళ్యాణ లక్ష్మి పథకానికి సంబంధించి హైకోర్టు పరిధిలో ఉండడంతో దానిని నిర్వీర్యం చేసేందుకు కాంగ్రెస్ కుట్రలు పన్నుతుందన్నారు. పలుమార్లు కౌంటర్ దాఖలు చేసేందుకు ప్రభుత్వానికి హైకోర్టు గడువు ఇచ్చిన ప్రభుత్వం స్పందించ లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకు పోరాటాలు సాగిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు పగడాల నాగరాజు, కూరాకుల నాగభూషణం, బచ్చు విజయ్‌కుమార్, కర్నాటి కృష్ణ, కూరాకుల వలరాజు, నాగండ్ల కోటేశ్వరరావు, బీరెడ్డి నాగచంద్రారెడ్డి, జ్యోతిరెడ్డి, షకీనా పాల్గొన్నారు.

# మానవత్వం చాటిన కమిషనర్

**-చిన్నారికి జస్వికశ్రీ గా నామకరణం**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్న చిన్నారికి అండగా నిలిచి ఖమ్మం కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య మానవత్వాన్ని చాటారు. ఆపదలో ఉన్న ఆ కుటుంబానికి స్వచ్ఛంద సంస్థతో పాటు ప్రభుత్వ సహకారంతో గుండె శస్త్ర చికిత్సకు అవసరమయ్యే రూ. 14 లక్షల ఆర్థిక సాయం మంజూరయ్యేలా కమిషనర్ కృషి చేశారు. ఖమ్మం నగరానికి చెందిన కాంపాటి రాకేష్, మాధవి దంపతులకు 2026 మే 9న ఆడబిడ్డ జన్మించింది. పుట్టిన 12 రోజుల అనంతరం చిన్నారి గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులకు తెలిసింది. వైద్య చికిత్సకు పెద్ద మొత్తంలో నగదు అవసరం కావడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. ఇట్టి విషయాన్ని ఖమ్మం నగర పాలక సంస్థలో శానిటేషన్ విధులు నిర్వహిస్తున్న చిన్నారి నాయనమ్మ నర్సమ్మ కమిషనర్ అభిషేక్ అగస్త్య దృష్టికి తీసుకు వచ్చారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న కమిషనర్ వెంటనే స్పందించి హృదయ స్వచ్ఛంద సంస్థతో పాటు ప్రభుత్వ సహకారంతో చిన్నారి గుండె శస్త్ర చికిత్సకు అవసరమైన రూ. 14 లక్షల ఆర్థిక సహాయాన్ని అందేలా కృషి చేశారు. జులై 28న చిన్నారికి గుండె శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించారు. ప్రస్తుతం చిన్నారి ఆరోగ్యంగా ఉంది. తల్లిదండ్రులు తమ చిన్నారిని తీసుకుని సోమవారం కార్పోరేషన్ కార్యాలయంకు వచ్చిన తమకు అండగా నిలిచి సాయం అందించినందుకు కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తమ చిన్నారికి పేరు పెట్టాలని కమిషనర్ అభిషేక్ అగస్త్యను కోరగా సంతోషం వ్యక్తం చేస్తూ చిన్నారికి జస్వికశ్రీ అని నామకరణం చేశారు. చిన్నారి సంపూర్ణ ఆరోగ్యంతో సంతోషంగా ఉండాలని కమిషనర్ ఆకాంక్షించారు. ఆపదలో ఉన్న కుటుంబానికి సకాలంలో స్పందించి వైద్య సాయం అందేలా కృషి చేసిన కమిషనర్‌కు చిన్నారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# అజ్ఞానాన్ని పారద్రోలే ఏకైక ఆయుధం విద్య

**-ఎస్‌బిఐటిలో ఘనంగా ఓరియంటేషన్ డే**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అజ్ఞానాన్ని పారద్రోలే ఏకైక ఆయుధం విద్య అని, గురువులను, తల్లిదండ్రులను గౌరవించడం విద్యార్థులు అలవర్చుకోవాలని పద్మశ్రీ పురస్కార గ్రహీత మహా సహస్ర అవధాని గరికపాటి నర్సింహారావు తెలిపారు. సోమవారం ఎస్‌బిఐటి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన మొదటి సంవత్సరం విద్యార్థుల ఓరియంటేషన్ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న గరికపాటి నర్సింహారావు గురువులు, తల్లిదండ్రుల ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు, ఫోన్లు, టివి వ్యాపకాలను మానివారంలో రెండు రోజులు డిజిటల్ ఉపవాసం అలవర్చుకోవాలన్నారు. తద్వారా విద్యపై దృష్టిని కేంద్రీకరించగలమన్నారు. మోయలేని భారం వల్లే ఒత్తిడి పెరుగుతుందన్నారు. విద్యను అభ్యసిస్తూనే దేశాభివృద్ధి గురించి ఆలోచించాలన్నారు. విద్యార్థులతో గరికపాటి ముఖాముఖి చర్చించారు. కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ ఎస్‌బిఐటిలో ఉన్నతమైన విద్యా ప్రమాణాలు పాటించడంతో పాటు విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో నిర్విరామంగా కృషి చేస్తున్నామన్నారు. ఈ ఏడాది ఉమ్మడి ఖమ్మంజిల్లాలో వంద శాతం అడ్మిషన్లు కలిగిన కళాశాలగా నిలవడం గర్వకారణమన్నారు. ఇది మా కళాశాలపై మరింత బాధ్యతను పెంచిందని తల్లిదండ్రుల నమ్మకానికి అనుగుణంగా విద్యార్థులను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఎస్‌బిఐటి విద్యార్థులకు కోడింగ్, రిజనింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్ మొదలైన శిక్షణా కార్యక్రమాలను మొదటి సంవత్సరం నుంచే నిర్వహిస్తున్నామని తద్వారా అత్యధిక ప్లేస్‌మెంట్లను ఏర్పాటు చేస్తున్నామని కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ శ్రీచైతన్య, ప్రిన్సిపాల్ డా॥ జి. రాజ్‌కుమార్, అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, హెచ్‌వోడిలు అమిత్ బిందాజ్, చరణ్‌సింగ్, స్ఫూర్తి, సుప్రియ మీనన్, పద్మావతి పాల్గొన్నారు.

# పిడిఎస్‌యు ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయాల ముట్టడి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ పిడిఎస్‌యు ఆధ్వర్యంలో మంత్రులు మల్లు భట్టివిక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయాలను ముట్టడించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్లు గడిచినా నేటికి రీయంబర్స్‌మెంట్ చెల్లించకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వ తీరు మారకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఖమ్మంజిల్లా అధ్యక్షులు లక్ష్మణ్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు మునగాల శివప్రశాంత్‌తో పాటు పలువురిని అరెస్టు చేశారు. ఈ కార్యక్రమంలో బుర్రా వీరభద్రం, సురేష్, హరిచంద్రప్రసాద్, రఘు, రాంచరణ్, మురళీ పాల్గొన్నారు.

# పిచ్చి మొక్కలకు నిలయంగా తహసీల్దార్ కార్యాలయం

**-శౌచాలయాల వైపు వెళ్లాలంటేనే భయం భయం -పట్టించుకోని అధికారులు**



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** రఘునాథపాలెం తహసీల్దార్ కార్యాలయం పిచ్చిమొక్కలకు నిలయంగా మారింది. పారిశుధ్య లోపంతో అధ్వాన్నంగా తయారైంది. నిత్యం వందలాది మంది ప్రజలు వచ్చే కార్యాలయంలో పరిస్థితి ఈవిధంగా ఉందంటే అధికారుల నిర్లక్ష్యం ఏవిధంగా ఉందో అర్థమవుతుంది. కార్యాలయ ఆవరణ మొత్తం పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగి అడవిని తలపిస్తుంది. ముఖ్యంగా శౌచాలయాల ప్రాంగణం చుట్టూ పిచ్చి మొక్కలు చుట్టుముట్టాయి. అటువైపు వెళ్లాలంటేనే ప్రజలు, సిబ్బంది భయపడుతున్నారు. విష పురుగులు, పాములు వస్తాయేమోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శౌచాలయాల వైపు వెళ్లేందుకు కొంత మేర వరకే శుభ్రం చేయడం శోచనీయం. తహసీల్దార్ ప్రాంగణంలో ఎటు చూసినా పిచ్చి మొక్కలే కనిపిస్తున్నాయి. ఆవరణలో తొట్లు, పరిసరాల్లో చెత్తా చెదారం, నిర్మాణ సామగ్రి గుట్టలు గుట్టలుగా పేరుకుపోయాయి. పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించే అధికారుల కార్యాలయాలే అపరిశుభ్రతకు నిలయంగా మారిందన్న విమర్శలు వినవస్తున్నాయి. తక్షణమే అధికారులు స్పందించి పిచ్చిమొక్కలను తొలగించి పూర్తి స్థాయిలో పారిశుధ్య పనులు చేపట్టాలని కోరుతున్నారు.

# సిఎస్ఆర్, ఎస్ఏఎఫ్ నిధుల వినియోగంపై అనుమానాలు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సింగరేణి ప్రభావిత గ్రామాల్లో సిఎస్ఆర్, ఎస్ఏఎఫ్ నిధులతో ఏర్పాటు చేసిన ఆర్ ఓ ప్లాంట్లలో అవకతవకలు జరిగాయనే అనుమానాలున్నాయని, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని బీజేపీ సత్తుపల్లి మండల అధ్యక్షుడు సాలి శివకృష్ణ డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు ఆదేశాలు, రాష్ట్ర అధికార ప్రతినిధి నంబూరి రామలింగేశ్వరరావు సూచనల మేరకు సోమవారం ఆర్ ఓ ప్లాంట్లను పరిశీలించారు. ఆర్ ఓ ప్లాంట్లకు సంబంధించిన మంజూరు ఉత్తర్వులు, అంచనా వ్యయాలు, బిల్లులు, టెండర్ వివరాలను సేకరించి రాష్ట్ర, జిల్లా నాయకుల దృష్టికి తీసుకెళ్తామని, అవసరమైతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని సాలి శివకృష్ణ హెచ్చరించారు. ప్రజల తాగునీటి కోసం కేటాయించిన సింగరేణి నిధుల్లో పారదర్శకత ఉండాలని ఆయన స్పష్టం చేశారు.

# డ్రైనేజీ పనులకు నిధులు మంజూరు చేయాలి



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం, గొందిగూడెం, మొండికుంట బీటీ రోడ్డు నిర్మాణంతో దెబ్బతిన్న సైడ్ డ్రైన్లు, కల్వర్టులను పునరుద్దరించడంతో పాటు రోడ్డుకు ఇరువైపులా సీసీ డ్రైన్లు నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని అశ్వాపురం గ్రామ పంచాయితీ సర్పంచ్ బానోత్ సదర్ లాల్ జిల్లా కలెక్టర్‌ను కోరారు. రోడ్డు ఎత్తు పెంచడంతో గ్రామ పరిధిలో సుమారు 1,050 మీటర్ల మేర డ్రైన్లు దెబ్బతిన్నాయని, పలు కల్వర్టులు కూడా పాడయ్యాయని తెలిపారు. దీంతో వర్షపు నీరు నిలిచి లోతట్టు ప్రాంతాల ఇళ్లలోకి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారంంగా సీసీ డ్రైన్ల నిర్మాణానికి సుమారు రూ 4లక్షల అదనపు నిధులు అవసరమవుతాయని, ప్రత్యేక నిధులు ద్వారా వాటిని మంజూరు చేయాలని సర్పంచ్ విజ్ఞప్తి చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పనులు చేపట్టాలని కోరారు.

# ప్రతీఒక్కరూ సన్నబియ్యం తినడమే ప్రభుత్వ లక్ష్యం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రతీ ఒక్కరూ సన్న బియ్యం ను తినాలనే లక్ష్యంతో ప్రభుత్వం సన్న బియ్యం ను అందిస్తుందని రాయగూడెం సర్పంచ్ బోయిన వేణు పేర్కొన్నారు. మండలం లోని రాయగూడెం లో మూడు నెలల ఉచిత సన్న బియ్యం ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతీ పేదోడు కూడ సన్న బియ్యం ను అందరితో పాటు తినాలని ఉద్దేశ్యంతో బియ్యం ను అందిస్తున్నట్లు తెలిపారు. పీడీఎస్ బియ్యం ను విక్రయాలు చేయకుండా పేదలు తినాలని సూచించారు. ఎవరైనా గ్రామంలోకి పీడీఎస్ బియ్యం కోనే వ్యాపారులు వస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మ కోర్లకుంట్ల నాగేశ్వరరావు, కట్టుకాచారాం సర్పంచ్ సైదులు, వీరబాబు, లక్క నాగరాజు, కోసూరి పానకాలు, రాజబాబు, బోయిన గురవయ్య,భోయిన రేణుకరావు, బోయిన నరసింహారావు, బ్రహ్మం, రామకృష్ణ, కిట్టయ్య, కమలాకర్, బోయిన నాగరాణి, మేకల భద్రమ్మ, మాణిక్యం, శ్రీలత, మేకల లక్ష్మి, శ్రావణి, ఉత్తరమ్మ, సుకన్య, లీలావతి, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.